RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | గురువారం | పేజీలు 8 | లింగబత్తిని కృష్ణ సీఎండీ & ఎడిటర్ 9701923260
సంపుటి: 4 సంచిక:104 | ఏప్రిల్ 09, 2026 | వెల: రూ.3-00



# బధిర విద్యార్థుల భవిష్యత్తుకు ఏదీ భరోసా?




## పదవ తరగతి తర్వాత సందిగ్ధంలో చదువు

- వరంగల్ టీటీడీ బధిర పాఠశాలను ఇంటర్ కళాశాలగా అప్ గ్రేడ్ చేయాలి
- టీటీడీ ఈవోకు మొరపెట్టుకున్నా కదలని యంత్రాంగం
- నిరీక్షణలో వందల మంది విద్యార్థులు
- బధిరుల విద్యపై పాలకుల నిర్లక్ష్యం
- జనసేన నాయకులకు తల్లిదండ్రుల వినతి
- పవన్ కళ్యాణ్, లోకేష్ దృష్టికి సమస్య
- పరిష్కారం కోసం ఎదురు చూపు

2లో

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

బధిర విద్యార్థుల ఉన్నత విద్యా భవిష్యత్తు ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. పదవ తరగతి వరకు ఎలాగోలా చదువు సాగుతున్నా, ప్రత్యేక ఇంటర్మీడియట్ కళాశాలలు లేకపోవడంతో ఆపై అంధకారం కనిపిస్తోంది. సాధారణ కళాశాలల్లో సంజ్ఞా భాష తెలిసిన ఉపాధ్యాయులు లేకపోవడం వల్ల బోధన అర్థం కాక విద్యార్థులు మధ్యలోనే చదువు మానేస్తున్నారు. వరంగల్‌లోని శ్రీ వెంకటేశ్వర బధిర పాఠశాలలో చదువుతున్న 166 మంది విద్యార్థుల పరిస్థితి ఇప్పుడు అత్యంత ఆవేదనకరంగా ఉంది. వీరిలో చాలామంది పేద వ్యవసాయ కుటుంబాలకు చెందిన వారు కావడంతో, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లి చదివించే ఆర్థిక స్తోమత లేక, ముఖ్యంగా ఆడపిల్లల రక్షణ పట్ల ఆందోళనతో తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అందుకే వరంగల్‌లోని టీటీడీ పాఠశాలనే ఇంటర్మీడియట్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని వారు కోరుతున్నారు. గతంలో అధికారుల నుంచి స్పందన కరువైనప్పటికీ, తాజాగా జనసేన నాయకుల ద్వారా ఈ సమస్యను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం గట్టి ప్రయత్నం జరుగుతోంది. వందలాది మంది బధిర విద్యార్థుల కలలు నిజం కావాలంటే ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రత్యేక కళాశాల ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.



2లో

# మధ్యప్రాచ్యంలో.. మళ్లీ యుద్ధ మేఘాలు

**అమెరికా 15రోజుల సీజ్ ఫైర్ ప్రకటన.. కొద్ది గంటల్లోనే పరిస్థితి తారుమారు**

- లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులతో అనిశ్చితి
- సందిగ్ధంలో కాల్పుల విరమణ ఒప్పందం
- హర్మూజ్ జలసంధి దిగ్బంధానికి ఇరాన్ నిర్ణయం
- అనుమతి లేకుండా వచ్చే నౌకలను ధ్వంసం చేస్తామని సాయుధ దళాల హెచ్చరిక
- ప్రపంచవ్యాప్తంగా మళ్లీ చమురు సెగ షురూ

**వేద న్యూస్, నేషనల్ డెస్క్**

మధ్యప్రాచ్యంలో శాంతి స్థాపన కోసం అమెరికా చొరవతో కుదిరిన రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం ప్రమాదంలో పడింది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగించడమే దీనికి ప్రధాన కారణమైంది. ఇజ్రాయెల్ చర్యలను తీవ్రంగా పరిగణించిన ఇరాన్, ఒప్పందం నుంచి వైదొలుగుతామని హెచ్చరించడమే కాకుండా, ప్రపంచ చమురు రవాణాకు జీవనాడి అయిన హర్మూజ్ జలసంధిని మరోసారి దిగ్బంధిస్తున్నట్లు ప్రకటించి

మిగతా 2వ పేజీలో

# తెలంగాణలో రక్షణరంగ పెట్టుబడులకు మొగ్గు



- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో టాటా లాక్ హీడ్ మార్టిన్ ప్రతినిధి భేటీ
- హైదరాబాద్‌లో సి-130జె సూపర్ హెర్క్యులస్ అసెంబ్లీ లైన్ ఏర్పాటుపై చర్చలు
- గ్లోబల్ అవసరాల కోసం టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌తో కలిసి ఎఫ్-16 వింగ్స్ తయారీ
- రాష్ట్రంలో ఎంఆర్ఓ కేంద్రాల ఏర్పాటుకు ఉన్న అవకాశాల పరిశీలన

**వేద న్యూస్, హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్రంలో విమానయాన మరియు రక్షణ రంగాల విస్తరణకు సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. టాటా లాక్ హీడ్ మార్టిన్ ఏరోస్ట్రక్చర్స్ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ టిమ్ రిఫిల్ బుధవారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని ఆయన

మిగతా 2వ పేజీలో

# ఐదు రోజుల పసికందు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణలు
- వేములవాడ ఏరియా ఆసుపత్రి ఎదుట ఆందోళన

2లో



# మంత్రి పొంగులేటి రాజీనామా చేయాలి



- రెవెన్యూ శాఖలో అవినీతి పెరిగిపోయింది
- మైనింగ్ కార్యకలాపాల్లో అక్రమాలు జరుగుతున్నాయి
- రాఘవ కన్‌స్ట్రక్షన్స్, మైనింగ్‌లో అంతా అవినీతే
- బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద

2లో

# బీఆర్ఎస్ నేతలవి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు



- అవినీతి బురదను ప్రభుత్వానికి అంటించే ప్రయత్నం చేస్తున్నారు
- నాదర్గుల్ భూములపై తప్పుడు ప్రచారం.. అబద్ధాలను నిజం చేయలేరు
- బీఆర్ఎస్ హయాంలోని మైనింగ్ అక్రమాలపై సీబీసీఐడీ విచారణకు ఆదేశం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

2లో

# ఐదు రోజుల పసికందు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణలు
- వేములవాడ ఏరియా ఆసుపత్రి ఎదుట ఆందోళన

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి**

రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామానికి చెందిన గర్భిణీ చిద్రవేణి అనూష ప్రసూతి కోసం వేములవాడ ఏరియా ఆసుపత్రికి చేరుకుంది. ఐదు రోజుల క్రితం ఆమెకు డెలివరీ జరగగా బాబుకు జన్మనిచ్చింది. అయితే బుధవారం ఆ పసికందు మృతి చెందడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. పసికందు మృతి చెందడంపై కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆసుపత్రి ఎదుట నిరసనకు దిగారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ బాబు మృతి చెందాడని వారు ఆరోపించారు. డెలివరీ జరిగినప్పటి నుండి సరైన వైద్య సేవలు అందించలేదని, శిశువు ఆరోగ్యంపై తగిన శ్రద్ధ చూపలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. తమకు న్యాయం చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే ఈ ఆరోపణలను ఖండించిన పిడియాట్రిక్ ఇన్‌చార్జ్ డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ, బాబు పుట్టినప్పటి నుండి ఆరోగ్యంగానే ఉన్నాడని, అవసరమైన చికిత్స అందించామని తెలిపారు. అకస్మాత్తుగా వచ్చిన ఇన్ఫెంట్ సంబంధిత సమస్య (ఇన్ఫెంట్ సిండ్రోమ్) కారణంగా మృతి సంభవించి ఉండవచ్చని పేర్కొన్నారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణకు సిద్ధంగా ఉన్నామని, అవసరమైతే పోస్ట్‌మార్టం కూడా నిర్వహిస్తామని చెప్పారు. ఇదిలా ఉండగా వేములవాడ ఏరియా ఆసుపత్రి ఇటీవల కాలంలో వరుస వివాదాలతో వార్తల్లో నిలుస్తోంది. గతంలో డెలివరీ కోసం వచ్చిన మహిళను వైద్యులు లేరంటూ వెనక్కి పంపిన ఘటన సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పాటు, పసికందుల మరణాలకు సంబంధించిన ఆరోపణలు కూడా వినిపించాయి. ఆసుపత్రి సేవలపై ప్రజల్లో అనుమానాలు పెరుగుతున్నాయి. ఇంకా ఇటీవల 9 నెలల గర్భిణీతో డ్యూటీలో ఉన్న డాక్టర్ దుర్భాషలాడిన ఘటన కూడా వెలుగులోకి వచ్చిందని, ఆమె ప్రైవేట్ ఆసుపత్రిలో డెలివరీ చేయించుకోవాల్సి వచ్చిందని బాధితురాలు తెలిపింది. ఈ ఘటనల నేపథ్యంలో ఆసుపత్రి సేవలపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైద్య సేవలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# పొంగులేటి రాజీనామా చేయాలి

**వేద న్యూస్, హైదరాబాద్**

తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో అసెంబ్లీ బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. బడ్జెట్ సమావేశాల్లో మైనింగ్ అంశంపై చర్చ జరుగుతున్న సమయంలో సరైన సమాధానాలు ఇవ్వకుండా తప్పించుకున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాఘవ కన్స్ట్రక ◌న్‌కు సంబంధించిన అక్రమాలను తమ నాయకుడు హరీష్ రావు ఆధారాలతో సహా బయటపెట్టారని తెలిపారు. ఆ విషయాలు వెలుగులోకి వచ్చిన వెంటనే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కేరళకు వెళ్లిపోయారని విమర్శించారు. ఎన్నికల ప్రచారం పేరుతో తప్పించుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. రెవెన్యూ శాఖలో అవినీతి పెరిగిపోయిందని, మైనింగ్ కార్యకలాపాల్లో అక్రమాలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ అంశాలపై ప్రభుత్వం స్పందించాల్సిన అవసరం ఉందని, కానీ అధికార పక్షం దానిని తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియా సమావేశం ద్వారా తనపై వచ్చిన ఆరోపణలను తప్పించుకునే ప్రయత్నం చేశారని కేపీ వివేకానంద అన్నారు. రాఘవ కన్స్ట్రక్షన్స్ విషయంలో ప్రభుత్వం స్పష్టమైన వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## బీఆర్ఎస్ నేతలవి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు

### మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ధ్వజం

**వేద న్యూస్, హైదరాబాద్**

తెలంగాణలో అధికారంలోకి వచ్చిన ప్రజా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు ఉద్దేశపూర్వకంగా అసత్య ఆరోపణలు చేస్తున్నారని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మండిపడ్డారు. బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్కలతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేక హరీశ్ రావు, కేటీఆర్ వంటి నేతలు తమపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. పచ్చకామెర్ల వాడికి లోకమంతా పచ్చగా కనిపించినట్లు.. గత పదేళ్లలో వారు చేసిన అవినీతిని అందరూ చేస్తున్నారని భ్రమపడుతున్నారు అని మంత్రి ఎద్దేవా చేశారు. రంగారెడ్డి జిల్లా నాదర్గుల్ భూ వివాదంపై వస్తున్న ఆరోపణలను మంత్రి పొంగులేటి తీవ్రంగా ఖండించారు. నాదర్గుల్ సర్వే నంబర్ 613లోని 373 ఎకరాల ప్రభుత్వ భూమికి బీఆర్ఎస్ హయాంలోనే (2021–22 మధ్య) అక్రమంగా రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు జరిగాయని ఆయన ఆధారాలతో వివరించారు. అప్పుడు అధికారంలో ఉన్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ఆ భూమిలో రోడ్లు వేయించింది కూడా వారేనని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు తన కుమారుడు హర్షా రెడ్డి ఆ భూమిని కబ్జా చేస్తున్నట్లు దుష్ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తాము అధికారంలోకి వచ్చాకే ఆ భూమి ప్రైవేటు పరం కాకుండా సుప్రీంకోర్టులో కౌంటర్ దాఖలు చేసి పోరాడుతున్నామని స్పష్టం చేశారు. వట్టినాగులపల్లి భూమి వివాదం తన కుటుంబానికి సంబంధించిన 60–70 ఏళ్ల పాత వ్యవహారమని, దానికి ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. కోర్టులో ఉన్న అంశాన్ని రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం శోచనీయమన్నారు. ఇక కొత్వాల్‌గూడ క్రషర్ విషయంలో హరీశ్ రావు చేసిన ఆరోపణలు పచ్చి అబద్ధాలని కొట్టిపారేశారు. 2007 నుంచే అక్కడ క్రషర్ నడుస్తోందని, రాఘవ కన్‌స్ట్రక్షన్ కేవలం అక్కడి నుండి మెటీరియల్ కొనుగోలు చేస్తోందని, దానికి మైనింగ్‌తో సంబంధం లేదని పవర్ బిల్లులు, జీఎస్టీ రికార్డులను మంత్రి బయటపెట్టారు.

# రక్షణరంగ పెట్టుబడులకు మొగ్గు

**మొదటి పేజీ తరువాయి..**

జూబ్లీహిల్స్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో భారత దేశంలో లాక్ హీడ్ మార్టిన్ కార్యకలాపాలకు సంబంధించిన తాజా పరిణామాలు మరియు భవిష్యత్తు ప్రణాళికలపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా రక్షణ రంగ తయారీ హబ్‌గా ఎదుగుతున్న తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు పెట్టడానికి ఉన్న సానుకూల అంశాలను టిమ్ రిఫిల్ ముఖ్యమంత్రికి వివరించారు. భారతదేశంలో సి–130జె సూపర్ హెర్క్యులస్ విమానాల కోసం ఫైనల్ అసెంబ్లీ లైన్‌ను ఏర్పాటు చేసేందుకు కంపెనీ చేస్తున్న నిరంతర ప్రయత్నాలపై ఈ సమావేశంలో చర్చలు జరిగాయి. అంతర్జాతీయ స్థాయిలో అత్యంత ఆదరణ పొందిన ఈ రవాణా విమానాల తయారీ ప్రక్రియలో తెలంగాణ భాగస్వామ్యం కావడం వల్ల రాష్ట్ర పారిశ్రామిక రంగానికి కొత్త గుర్తింపు లభిస్తుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. దీనికి సంబంధించి అవసరమైన మౌలిక సదుపాయాలు మరియు నైపుణ్యం కలిగిన మానవ వనరులు హైదరాబాద్‌లో పుష్కలంగా ఉన్నాయని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ప్రతినిధి బృందానికి గుర్తు చేశారు.

# తమిళ'నాట' స్థానానికి బీజేపీ ప్రయత్నాలు!




ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ అయిన బీజేపీ.. విస్తరణే తన ఆకాంక్షగా చాలా కాలంగా తమిళనాడుపై దృష్టి సారిస్తున్నది. అయినా అక్కడ పాగా వేయడం పక్కన పెడితే కనీసంగా అక్కడ స్థానం సంపాదించడానికి ఆపసోపాలు పడుతున్నది. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ స్వయంగా తమిళనాడుకు వచ్చి పలు ప్రారంభోత్సవాలు చేశారు. తమిళ భాష ఎంతో గొప్పదని కీర్తిస్తూ.. చోళుల కాలం నాటి 'సింగోల్'ను పార్లమెంటులో ప్రతిష్ఠించి పెద్ద ఎత్తున ప్రచారం చేశారు.మాజీ ఐపీఎస్ అధికారి అన్నామలైకు పూర్తి బాధ్యతలు అప్పజెప్పి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగానూ అవకాశం ఇచ్చారు. కానీ, ఆ తర్వాత ఆయనను ఆ బాధ్యతలనుంచి తప్పించారు. అన్నాడీఎంకేతో పొత్తులో భాగంగా ప్రస్తుత ఎన్నికలలో 27 స్థానాలలో మాత్రమే కమలనాథులు పోటీ చేస్తున్నారు. ఎన్డీయే కూటమిలోఅన్నాడీఎంకేతో పొత్తులో ఉన్నా ప్రముఖ సినీనటుడు, టీవీకే అధినేత విజయ్‌ను కూటమిలో భాగం చేసుకునేందుకు ప్రయత్నాలు చేసినట్లు వార్తలొచ్చాయి.విజయ్‌ను డిప్యూటీ సీఎంను చేస్తామని ఆఫర్ ఇచ్చినట్లు తెలిసింది. అయితే, తమిళనాట ద్విముఖంగా ఉన్న రాజకీయ ముఖచిత్రంలో మూడో ప్రత్యామ్నాయ శక్తిగా వచ్చి 'త్రిముఖ పోరు'ను విజయ్ తప్పనిసరి చేశారు.

> ఈ నేపథ్యంలోనే జాతీయవాదం బలమైన ఆయుధంగా భావించే బీజేపీకి తమిళనాట ఆదరణ అంతంత మాత్రంగానే కనిపిస్తోంది. అన్నామలై వంటి నాయకుడు క్షేత్రస్థాయిలో తమిళనాట కొంత ప్రయత్నం చేసినా ఢిల్లీ అధిష్టానం బహుశా అంచనా తప్పి ఆయనను తప్పించినట్లు కనిపిస్తోంది. ఏది ఏమైనా తమిళనాడులో బీజేపీ బలమెంత అనేది తెలియాలంటే ఈ నెల 23న జరిగే ఎన్నికల తర్వాత వచ్చే ఫలితాల సమయంలోనే చూడాలి.

### అనుకున్న స్థాయిలో ఆదరణ ఏదీ?

234 అసెంబ్లీ స్థానాలున్న తమిళనాడులో తమ ప్రభావం, ప్రాబల్యం పెంచుకునే దిశగా మాత్రమే బీజేపీ అడుగులు కనిపిస్తున్నాయి. అయితే, అనుకున్న స్థాయిలో అయితే కమలం పార్టీకి తమిళనాట ఆదరణ లభించే స్థితి లేదనే రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఆ అంచనాకు వచ్చిన నేపథ్యంలోనే బీజేపీ ఎన్డీయే కూటమిలో భాగస్వామి పార్టీలకు అధిక ప్రాధాన్యతను ఇచ్చిందనే వాదనలూ ఉన్నాయి. దానికి తోడు 'ద్రవిడవాదం' బలంగా ఉండి.. 'ద్రావిడ పక్షాలఆధిపత్య' పోరు తారస్థాయికి ప్రతి సారి చేరుకునే క్రమాన్ని బీజేపీ పెద్దలు అర్థం చేసుకున్నట్లున్నారు. అందుకే తాను సైద్ధాంతికపరంగా బీజేపీని ఎదిరిస్తానని పేర్కొన్నా కానీ, విజయ్‌తో పొత్తుకు ప్రయత్నాలు చేసినట్లు కనిపిస్తోంది. 'రాష్ట్రాల హక్కులు, ప్రాంతీయపార్టీ నేతగా ప్రాంతీయప్రాబల్యం, రాష్ట్రాలకు నిధులు' వంటి విషయాలతో తమిళనాట డీఎంకే, ఏఐఏడీఎంకే లీడర్లు చాలా కాలం నుంచి రాజకీయం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే జాతీయవాదం బలమైన ఆయుధంగా భావించే బీజేపీకి తమిళనాట ఆదరణ అంతంత మాత్రంగానే కనిపిస్తోంది. అన్నామలై వంటి నాయకుడు క్షేత్రస్థాయిలో తమిళనాట కొంత ప్రయత్నం చేసినా ఢిల్లీ అధిష్టానం బహుశా అంచనా తప్పి ఆయనను తప్పించినట్లు కనిపిస్తోంది. ఏది ఏమైనా తమిళనాడులో బీజేపీ బలమెంత అనేది తెలియాలంటే ఈ నెల 23న జరిగే ఎన్నికల తర్వాత వచ్చే ఫలితాల సమయంలోనే చూడాలి.



**లింగబత్తిని కృష్ణ**
సీనియర్ జర్నలిస్ట్
9701923260

# పశ్చిమాసియాలో.. మళ్లీ యుద్ధ మేఘాలు

**మొదటి పేజీ తరువాయి..**

సంచలనం సృష్టించింది. ఈ ఆకస్మిక పరిణామంతో పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. కాల్పుల విరమణతో ఇప్పుడిప్పుడే కుదుటపడుతున్న ప్రాంతీయ పరిస్థితులు మళ్లీ ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారడంతో అంతర్జాతీయ సమాజం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చొరవతో ఇజ్రాయెల్ మరియు ఇరాన్ మధ్య రెండు వారాల పాటు యుద్ధ విరమణ ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం, హర్మూజ్ జలసంధి మార్గంలో అంతర్జాతీయ నౌకల రాకపోకలను ఎటువంటి ఆటంకం లేకుండా సురక్షితంగా కొనసాగించడం ప్రధాన షరతు. అయితే, ఈ ఒప్పందం లెబనాన్‌కు వర్తించదని, అక్కడి హెజ్బొల్లా బలగాలపై తమ సైనిక చర్యలు యథావిధిగా కొనసాగిస్తామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పష్టం చేశారు. అన్నట్లుగానే, లెబనాన్‌పై, ముఖ్యంగా రాజధాని బీరట్‌లోని నివాస మరియు వాణిజ్య ప్రాంతాలపై ఇజ్రాయెల్ వైమానిక దాడులను తీవ్రతరం చేసింది. ఈ దాడుల్లో డజన్ల కొద్దీ పౌరులు మరణించగా, వందలాది మంది తీవ్రంగా గాయపడ్డారు. ఇజ్రాయెల్ చర్యలు కాల్పుల విరమణ ఒప్పందాన్ని బాహాటంగా ఉల్లంఘించడమేనని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి మండిపడ్డారు. దాడులు ఇలాగే కొనసాగితే తాము ఒప్పందం నుంచి వైదొలగాల్సి వస్తుందని తీవ్రంగా హెచ్చరించారు. మరోవైపు, తమ అనుమతి లేకుండా హర్మూజ్ జలసంధిలోకి ప్రవేశించే ఏ నౌకనైనా ధ్వంసం చేస్తామని ఇరాన్ సాయుధ దళాలు ప్రకటించాయి. ప్రపంచ చమురు సరఫరాలో దాదాపు మూడో వంతు ఈ జలసంధి గుండానే జరుగుతుంది.

గతంలో ఇరాన్ ఈ మార్గాన్ని నిరోధించినప్పుడు అంతర్జాతీయంగా చమురు ధరలు రికార్డు స్థాయిలో పెరిగిన విషయం తెలిసిందే. తాజా పరిణామం మళ్లీ అదే విధమైన ఆర్థిక సంక్షోభానికి దారితీస్తుందని ప్రపంచ దేశాలు భయాందోళన చెందుతున్నాయి.

# బధిర విద్యార్థుల భవిష్యత్తుకు ఏదీ భరోసా?



**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

బధిర విద్యార్థులకు పదవ తరగతి వరకు ఎలాగోలా చదువు సాగుతున్నా, ఆపై ఉన్నత విద్యకు వెళ్లాలంటే అంధకారం కనిపిస్తోంది. ప్రస్తుతం మన విద్యా వ్యవస్థలో బధిరుల కోసం ప్రత్యేక ఇంటర్మీడియట్ కళాశాలలు లేకపోవడం వారి ఎదుగుదలకు పెద్ద అడ్డంకిగా మారింది. సాధారణ కళాశాలల్లో చేరినప్పటికీ, అక్కడి బోధనా పద్ధతులు శబ్ద ఆధారితంగా ఉండటం, ఉపాధ్యాయులకు సంజ్ఞా భాషపై అవగాహన లేకపోవడంతో విద్యార్థులు పాఠాలను అర్థం చేసుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కమ్యూనికేషన్ గ్యాప్ వల్ల విసుగు చెంది, ఎంతో మంది ప్రతిభావంతులైన విద్యార్థులు చదువును మధ్యలోనే ఆపేస్తున్నారు.

### ప్రత్యేక కళాశాల ఒక సామాజిక అవసరం

బధిరుల అవసరాలను గుర్తించి ప్రత్యేక ఇంటర్ కళాశాలలను ఏర్పాటు చేస్తే, వారికి సంజ్ఞా భాష ద్వారా నాణ్యమైన విద్యను అందించే అవకాశం ఉంటుంది. ప్రత్యేక శిక్షణ పొందిన అధ్యాపకులు, ఆధునిక దృశ్యమాలికలు, సాంకేతిక పరికరాల సహాయంతో బోధన సాగితే విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపడతాయి. ఇది వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపి, సమాజంలో ఇతరులతో సమానంగా పోటీ పడేలా చేస్తుంది. విద్యా సమానత్వం సాధించాలంటే ప్రభుత్వం ఈ దిశగా అడుగులు వేయడం అత్యవసరం.

### వరంగల్ టీటీడీ పాఠశాల విద్యార్థుల ఆవేదన

వరంగల్‌లోని శ్రీ వెంకటేశ్వర బధిరుల ఉన్నత పాఠశాల ఇందుకు ఒక సజీవ ఉదాహరణ. ఇక్కడ ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు సుమారు 166 మంది బధిర బాలబాలికలు విద్యనభ్యసిస్తున్నారు. అయితే, పదవ తరగతి పూర్తి కాగానే వారి విద్యా ప్రస్థానానికి ఫుల్‌స్టాప్ పడుతోంది. పై చదువుల కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాలంటే ఇక్కడి విద్యార్థుల తల్లిదండ్రుల ఆర్థిక స్తోమత సహకరించడం లేదు. వీరిలో మెజారిటీ కుటుంబాలు వ్యవసాయంపై ఆధారపడి బతుకుతున్నవే.

### తల్లిదండ్రుల భయాందోళనలు

ప్రస్తుత సామాజిక పరిస్థితుల్లో తమ పిల్లలను, ముఖ్యంగా ఆడపిల్లలను దూర ప్రాంతాలకు పంపి చదివించాలంటే తల్లిదండ్రులు తీవ్ర అభద్రతా భావానికి లోనవుతున్నారు. అందుకే వరంగల్‌లోని టీటీడీ ఉన్నత పాఠశాలనే ఇంటర్మీడియట్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని వారు కోరుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో కానీ, టీటీడీ ఆధ్వర్యంలో కానీ బధిరుల కోసం ప్రత్యేక ఇంటర్ కళాశాల లేకపోవడం శోచనీయం. వరంగల్‌లో ఈ కళాశాల అందుబాటులోకి వస్తే విద్యార్థులకు సమయం, డబ్బు ఆదా అవ్వడమే కాకుండా వారి భవిష్యత్తుకు భరోసా లభిస్తుందని తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.







### పరిష్కారం కోసం నిరీక్షణ..

తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ గత ఏడాది టీటీడీ ఈవోకు విన్నవించినా, స్థానిక ప్రజాప్రతినిధులను సంప్రదించినా ఆశించిన ఫలితం దక్కలేదు. తాజాగా, తమ గోడును జనసేన పార్టీ వరంగల్ జిల్లా నాయకులు డా. గోళ్ళ రాజేంద్రప్రసాద్, గడ్డం రాకేష్, మేకల ప్రసన్న కుమార్ దృష్టికి తల్లిదండ్రులు తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన వారు, ఈ విషయాన్ని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వందలాది మంది బధిర విద్యార్థుల కలలు నిజం కావాలంటే ప్రభుత్వం తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉంది.

### పవన్ సార్ మీరే దిక్కు..



మాది భూపాలపల్లి జిల్లా. రెక్కాడితే గానీ డొక్కాడదు.. మా పాప పుట్టుకతోనే మూగ, చెవిటి. వరంగల్లోని బదిరుల పాఠశాలలో చదివించాం.. ఇప్పుడు ఇప్పుడు బయకు తీసుకెళ్లి ఇంటర్ చేపించే స్థోమత లేదు.. వరంగల్ పాఠశాలలోనే ఇంటర్ కూడా ఏర్పాటు చేయాలి.. పవన్ సార్ మీరే దిక్కు.. ఇంటర్ వరకు ఏర్పాటు చేస్తే మా బిడ్డకు మంచి భవిష్యత్ ఉంటుంది..

### చదివించే స్థోమత మాకు లేదు..



నాకు ఇద్దరు బిడ్డలు.. ఒక బిడ్డను వరంగల్ టీటీడీ పాఠశాలలోనే ఫస్ట్ నుంచి టెన్త్ వరకు చ దివించాం. . అందులో ఇంటర్ లేదు.. మేం కూలీ చేసూకుంటూ బతికేవాళ్లం.. బయటి ప్రదేశాలకు వెళ్లి చదివించే స్థోమత మాకు లేదు.. దయచేసి పెద్దలు ఆలోచించి వరంగల్లోని టీటీడీ పాఠశాలలోనే ఇంటర్ కూడా ఏర్పాటు చేయాలని కోరుకుంటున్నాం..

### ఎంతో మంది విద్యార్థులకు భరోసా



మాది జనగామా జిల్లా పాలకుర్తి మండలం.. మా పాపను ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు వరంగల్ టీటీడీ బదిరుల పాఠశాలలో చదివించాం. ఇప్పుడు ఇంటర్ అందులో లేదు.. పవన్ సార్ మీరే దయతలచి ఆ పాఠశాలలో ఇంటర్ కాలేజీ ఏర్పాటు చేయాలని వేడుకుంటున్నాం.. ఇంటర్ ఏర్పాటు చేసే ఎంతో మంది బదిర విద్యార్థుల జీవితాలు బాగుపడతాయి..

వేద న్యూస్

గురువారం ఏప్రిల్ 09, 2026

## సర్పంచ్ రాజుకు జాతీయ స్థాయి పురస్కారం

**వేద న్యూస్, చొప్పదండి:**



చొప్పదండి మండలంలోని కోనేరుపల్లె గ్రామ సర్పంచ్ కాసు వేణుగోపాల్ రాజు జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి సాధించారు. భారత గ్రామీణాభివృద్ధిని ప్రోత్స హించేందుకు క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రూపొందించిన "సర్పంచ్ సంవాద్" యాప్ ద్వారా నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా "క్రీడా మిత్ర పంచాయతీ" ప్రణాళికలో ఆయన ఈ ప్రతిభ కనబరిచారు. గ్రామ యువతను క్రీడల వైపు మళ్లిస్తూ, సీఎం కప్ పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించిన విధానాన్ని ప్రతిబింబించే వీడియోకు దేశవ్యాప్తంగా మొదటి స్థానం లభించింది. ఈ సందర్భంగా సర్పంచ్ కాసు వేణుగోపాల్ రాజుకు రూ. 35వేల నగదు బహుమతి అందించారు. ఈ విజయంతో గ్రామానికి ప్రత్యేక గుర్తింపు లభించింది.

## మండల విద్యాధికారిణిగా బాధ్యతలు స్వీకరించిన జి. జ్యోతి



- డీటీఎఫ్ ఆధ్వర్యంలో సన్మానం

**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి మండల కేంద్రంలోని మానవ వనరుల కేంద్రంలో మండల విద్యాధికారిణిగా బాధ్యతలు స్వీకరించిన జి. జ్యోతిని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) మండల శాఖ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను శాలువాతో సన్మానించి, మండలంలోని విద్యా వ్యవస్థ అభివృద్ధిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు గుర్రాల శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉత్కం వేణుగోపాల్, రాష్ట్ర, జిల్లా కౌన్సిలర్లు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్ల పంపిణీ

- సేవలను ఆధునీకరించేందుకే.. చొప్పదండి ఎమ్మెల్యే



**వేద న్యూస్, గంగాధర:**

గంగాధర మండలం మధురనగర్ ప్రజా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో చొప్పదండి నియోజకవర్గానికి చెందిన 140 మంది అంగన్వాడీ టీచర్లకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం స్మార్ట్‌ఫోన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహిళా, శిశు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ అంగన్వాడీ సేవలను ఆధునికీకరించేందుకు ఈ స్మార్ట్‌ఫోన్లు అందజేస్తోందని తెలిపారు. సిబ్బంది హాజరు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహార వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో ఇవి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అంగన్వాడీ టీచర్లు ఈ సాంకేతిక వనరులను సమర్థంగా వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో, తహసీల్దార్, ఎంపీడీవో, సూపర్వైజర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

- ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విభిన్న వైద్య సేవలు

**వేద న్యూస్, వేములవాడ:**



వేములవాడ పట్టణంలోని మున్నూరు కాపు సత్రంలో రేపు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ప్రతిమ ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. లయన్స్ క్లబ్, మాతృశ్రీ హాస్పిటల్ సహకారంతో నిర్వహించనున్న ఈ శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు పాల్గొని సేవలు అందించనున్నారు. బీపీ, షుగర్, గుండె, దంత, చర్మ, కంటి, ఎముకలు, మహిళల ఆరోగ్య సమస్యలకు ఉచిత పరీక్షలు నిర్వహించడంతో పాటు 2డీ ఈకో, ఎక్స్ రే, మామోగ్రఫీ, ఈసీజీ వంటి నిర్ధారణ పరీక్షలు కూడా అందుబాటులో ఉంటాయి. అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. మరిన్ని వివరాలకు 9100033082, 9640515720 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

## రోగి కుటుంబంపై ఆస్పత్రి సిబ్బంది దాడి

- పేరు నమోదు సమయంలో వాగ్వాదం
- బండరాయితో కొట్టే ప్రయత్నించారని ఆరోపణలు
- సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రిలో కలకలం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ కోసం వచ్చిన రోగి కుటుంబ సభ్యులపై సిబ్బంది దాడి చేశారంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామానికి చెందిన దేవరాజు కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ కోసం ఆసుపత్రికి వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా డయాలసిస్ సెంటర్‌లో నమోదు సమయంలో సిబ్బందితో వాగ్వాదం జరిగి, అనంతరం కొందరు సిబ్బంది తమపై దాడి చేశారని ఆరోపించారు. దాడి సమయంలో పెద్ద బండరాయితో కొట్టేందుకు కూడా యత్నించారని, ప్రాణభయంతో అక్కడి నుంచి బయటపడినట్లు తెలిపారు. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు, వారి కుటుంబ సభ్యుల భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## మహిళల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత

- గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెరుగైన సేవలు
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- అంగన్వాడీలకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

మహిళల ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న ఆరోగ్య అవగాహన వారోత్సవాల్లో భాగంగా బుధవారం సురక్షిత మాతృత్వ దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలోని 552 మంది అంగన్వాడీ కేంద్రాల బాధ్యులకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశారు. అలాగే సంక్షేమ, వైద్య ఆరోగ్య శాఖలకు సంబంధించిన అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెరుగైన సేవలు అందుతున్నాయని తెలిపారు. ప్రసవానంతరం ఆరు నెలలపాటు పోషకాహారం అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరవేసేందుకు 99 రోజుల కార్యాచరణ రూపొందించిందని వివరించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని హెచ్చరిస్తూ, అటువంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అంగన్వాడీ కేంద్రాల సేవలను గర్భిణీలు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఆరోగ్య వారోత్సవాల ద్వారా గర్భిణుల నమోదు, ఆరోగ్య పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. అంగన్వాడీలు, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పోషకాహారం సక్రమంగా అందించాలని ఆదేశించారు. స్మార్ట్ ఫోన్లలో వివరాలు నమోదు చేయాలని, బాలింతలు పిల్లలకు తల్లిపాలు అందించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, మున్సిపల్ ప్రతినిధులు, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా వైద్యాధికారి, సంక్షేమ శాఖ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## బోరు బావికి నూతన మోటారు ఏర్పాటు

- నీటిని వృథా చేయొద్దు: సర్పంచ్ కవితా నాయక్

**వేద న్యూస్, నల్లబెల్లి:**



నల్లబెల్లి మండలం మూడుచెక్కలపల్లి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి పంచాయతీ పాలకవర్గం చర్యలు చేపట్టింది. గ్రామంలోని అంగోతు కోటియా ఇంటి సమీపంలో ఉన్న బోరు బావికి బుధవారం నూతన మోటారు ఏర్పాటు చేశారు. గత కొంతకాలంగా నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తడంతో గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు మోటారు అమర్చి నీటి సరఫరాను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సపావట్ కవితా దేవు నాయక్ మాట్లాడుతూ.. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నీరు అమూల్యమైనదని, ప్రతి ఒక్కరూ వృథా చేయకుండా బాధ్యతగా వినియోగించుకోవాలని సూచించారు. గ్రామాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. కొత్త మోటారు ఏర్పాటు కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మహిళల ఆరోగ్యంపై విస్తృత అవగాహన అవసరం



- వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య పిలుపు
- సురక్షిత మాతృత్వ దినోత్సవం నిర్వహణ

**వేద న్యూస్, హనుమకొండ:**

మహిళల ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన అంశాలపై సమగ్ర అవగాహన కల్పించడం అత్యంత అవసరమని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన సురక్షిత మాతృత్వ దినోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భధారణకు ముందే ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రల వినియోగంపై మహిళల్లో అవగాహన పెంపొందించడం అత్యంత కీలకమన్నారు. ఇటీవల వైకల్యాలు, ఆటిజం వంటి సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో గర్భధారణ ప్రణాళిక దశలోనే సరైన పోషకాహారం, వైద్య సలహాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ అంశంపై వైద్యశాఖ ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. రక్తహీనత (అనీమియా), సికిల్ సెల్ వంటి వ్యాధులపై ప్రజల్లో చైతన్యం పెంపొందించాలని పేర్కొన్నారు. గర్భిణీలు అవసరమైన అన్ని వైద్య పరీక్షలు, ముఖ్యంగా టిఫా స్కానింగ్‌ను నిర్దిష్ట సమయంలో చేయించుకోవాలని సూచించారు. ప్రసవానంతర దశలో మహిళల మానసిక ఆరోగ్యంపైనా ప్రత్యేక శ్రద్ధ అవసరమని తెలిపారు. సిజేరియన్ ప్రసవాలను తగ్గించి సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, కుటుంబ నియంత్రణపై అవగాహన పెంపొందించడం ద్వారా తల్లి, శిశు ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా ప్రజలకు చేరవేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ మసూద్, డీఎంహెచ్ఓ డా. అప్పయ్యతో పాటు పలువురు మహిళా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# కుల కట్టుబాట్లతో బహిష్కరణ సిగ్గుచేటు

**– అంబేద్కర్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మారపల్లి క్రాంతి కుమార్**




**వేద న్యూస్, శాయంపేట:**

హనుమకొండ జిల్లా శాయంపేట మండలం ప్రగతి సింగారం గ్రామంలో ఒకే కులానికి చెందిన కుటుంబాన్ని బహిష్కరించడం సిగ్గుచేటు చర్య అని దళిత బహుజన సంఘాలు, అంబేద్కర్ ఉత్సవ కమిటీ ఖండించాయి. కుల బహిష్కరణకు గురైన మసికె లక్ష్మీపతి కుటుంబాన్ని నాయకులు పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మారపల్లి క్రాంతి కుమార్ మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చిన దశాబ్దాల తర్వాత కూడా కుల కట్టుబాట్ల పేరిట ఇలాంటి చర్యలు కొనసాగడం దుర్మార్గమన్నారు. కులంలో సమస్యలు వస్తే వాటిని చర్చించి పరిష్కరించాల్సిందిపోయి, బహిష్కరణకు దిగడం సరైంది కాదని అన్నారు. ఒకే కులానికి చెందిన కుటుంబాన్ని బహిష్కరించడం మంచి పరిణామం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రభుత్వం, అధికారులు, సామాజిక మేధావులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అరికిల్ల దేవయ్య, మొగ్గం సుమన్, మారపల్లి విజయ్ కుమార్, మారపల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సెన్సస్ 2027 హెచ్ఎల్బీ ఏర్పాటుపై శిక్షణ

**– సిబ్బంది పూర్తి అవగాహనతో పనిచేయాలి: అధికారులు**

**వేద న్యూస్, నల్లబెల్లి:**



జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నల్లబెల్లి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సెన్సస్ 2027కు సంబంధించిన హెచ్ఎల్బీ (హౌస్ లిస్టింగ్ బ్లాక్) ఏర్పాటుపై జీపీవోలు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి కల్పన మాట్లాడుతూ, సెన్సస్ ప్రక్రియలో హెచ్ఎల్బీల ఏర్పాటు కీలకమని, ఎటువంటి పొరపాట్లు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. తహసీల్దార్ ముప్పు కృష్ణ మాట్లాడుతూ.. ఇంటింటి వివరాల సేకరణలో క్షేత్రస్థాయి సిబ్బంది పూర్తి అవగాహనతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి రవి, ఏఎస్ఓ అనిల్, రెవెన్యూ సిబ్బంది, జీపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

# కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



ప్రజా ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ అండగా ఉంటుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. వేములవాడ రూరల్ పరిధిలో 40 మంది, పట్టణ అర్బన్ పరిధిలో 126 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు. అదేవిధంగా అర్బన్ పరిధిలో రూ.13.60 లక్షల విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను 43 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## భీమేశ్వర స్వామిని దర్శించుకున్న మాజీ స్పీకర్

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**




వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారిని తెలంగాణ మాజీ స్పీకర్, శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు మధుసూదనాచారి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మండపంలో వేద పండితులు, అర్చకులు ఆయనకు ఆశీర్వచనం అందించి, స్వామివారి శేష వస్త్రం, లడ్డు ప్రసాదం అందజేశారు.

# రాజన్న ప్రసాదంగా కోడెల పంపిణీ

**– 210 జతల కోడెలు రైతులకు ఉచితం – ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



వేములవాడ రాజన్న ఆలయంలో కోడెలను మొక్కుల రూపంలో సమర్పించడం ప్రత్యేక సంప్రదాయమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. రాజన్న స్వామి ప్రసాదంగా 210 జతల కోడెలను రైతులకు ఉచితంగా పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కోడెలను అందుకున్న రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కోడెల పంపిణీ కార్యక్రమం నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# రైతుల సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం

**– ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**
**– మూడు చెక్‌డ్యాంల నిర్మాణానికి శంకుస్థాపన**

**వేద న్యూస్, హన్వాడ:**



మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని హన్వాడ మండలంలో రైతుల సాగునీటి సమస్యల పరిష్కారానికి కీలక అడుగు పడింది. నీటిపారుదల శాఖ నిధులు రూ.830.50 లక్షలతో మూడు చెక్‌డ్యాంల నిర్మాణానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఇబ్రహీంబాద్ (రూ.227.50 లక్షలు), మునిమోక్షం (రూ.268 లక్షలు), వేపూర్ (రూ.335 లక్షలు) గ్రామాల్లో చెక్‌డ్యాంల నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చెక్‌డ్యాంల నిర్మాణంతో సాగునీటి కొరత తగ్గి, భూగర్భ జలాలు పెరిగి, పంటల దిగుబడులు మెరుగుపడతాయని తెలిపారు. రైతుల సంక్షేమం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, వ్యవసాయ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి ఉజ్వల యోజన ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయండి

**– ఉత్తమ సామాజిక సేవా జాతీయ అవార్డు గ్రహీత బొడ్డు బాబురావు**

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి :**



నిరుపేదలకు ఉచితంగా వంట గ్యాస్ అందించే ఉజ్వల యోజన ప్రత్యేక కౌంటర్ ను నేలకొండపల్లి మండలం పైనంపల్లి లో గ్రామ ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేయాలని మండల ఉత్తమ సామజిక సేవా జాతీయ అవార్డు గ్రహీత బొడ్డు బాబురావు డిమాండ్ చేశారు. వెంటనే గ్యాస్ ఏజెన్సీ వారు స్పందించి కౌంటర్ ను ఏర్పాటుచేసి ఎలాంటి రుసుం తీసుకోకుండా ప్రభుత్వం అందించే గ్యాస్ ను అందించాలని కోరారు.

# వ్యక్తి అదృశ్యం...

**వేద న్యూస్, కోటగిరి :**



కోటగిరి మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ఇత్తే చిన్న హన్మండ్లు (63) అదృశ్యమైనట్లు కోటగిరి ఎస్సై సునీల్ తెలిపారు. ఎస్సై సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. హన్మండ్లు అనే వ్యక్తి మార్చ్ 30 వ తేదిన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లారని, అప్పటి నుండి ఆయన తిరిగి ఇంటికి రాకపోవడంతో హన్మండ్లు కొడుకు ఇత్తే మారుతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సునీల్ వెల్లడించారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారానికి సర్పంచ్ కృషి..

**వేద న్యూస్, రుద్రూర్ :**



రుద్రూర్ మండలం చిక్కడపల్లి గ్రామంలో విద్యుత్ సమస్య పరిష్కారానికి సర్పంచ్ రమేష్ దృష్టి సారించారు. మంగళవారం రాత్రి అనుకోకుండా తలెత్తిన సమస్యను పరిష్కరించారు. మంగళ వారం రాత్రి విద్యుత్ సమస్య తలెత్తడంతో గ్రామమంతా చీకటిగా మారింది. వెంటనే స్పందించిన సర్పంచ్ రమేష్ విద్యుత్ అధికారుల సమన్వయంతో ట్రాన్స్ఫార్మరను పరిశీలించారు. 150కేవీ ట్రాన్సఫార్మర్ చెడిపోవడంతో అదేస్థానంలో 250కేవీ ట్రాన్స్ఫార్మర్ ను అధికారుల సహకారంతో ఏర్పాటు చేశారు. వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించిన విద్యుత్ అధికారులకు సహకరించిన గ్రామస్తులకు సర్పంచ్ రమేష్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రంలో లైన్మన్ షాబిల్, ఆనంద్, గంగాధర్, రాము అశోక్ గణేష్, ప్రవీణ్, తదితరులు ఉన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభం

**వేద న్యూస్, దేవరకద్ర:**

కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హమాలీ సంఘం విశ్రాంతి భవనం ప్రారంభం

**వేద న్యూస్, దేవరకద్ర:**

మదనపురం మార్కెట్ యార్డ్‌లో రూ.9 లక్షలతో నిర్మించిన హమాలి సంఘం విశ్రాంతి భవనాన్ని ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. అలాగే రూ.30 లక్షలతో ఫుడ్ గ్రైన్ స్టోరేజ్ గోదాం నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హమాలీల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని విశ్రాంతి భవనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంకా పోషణ్ ట్రాకర్ యాప్ ద్వారా గర్భిణీలు, బాలింతలు, పిల్లల వివరాలను నమోదు చేయడానికి అంగన్‌వాడీ సిబ్బందికి 5జీ స్మార్ట్‌ఫోన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మార్కెట్ యార్డ్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 108 అంబులెన్స్ సేవలపై ఆకస్మిక తనిఖీ

**వేద న్యూస్, కారేపల్లి :**



సింగరేణి ప్రాంతంలో అత్యవసర వైద్య సేవల నాణ్యతను మెరుగుపర్చే దిశగా 108 అంబులెన్స్‌పై కీలక తనిఖీ నిర్వహించారు. జీవీకే గ్రీన్ హెల్త్ సర్వీసెస్‌కు చెందిన క్వాలిటీ కంట్రోల్ ఆడిటింగ్ అధికారి వెంకటేశ్వర్లు బుధవారం ఈ తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా అంబులెన్స్‌లో ఉన్న అత్యవసర వైద్య పరికరాలు, వాహన నిర్వహణ పరిస్థితి, అవసరమైన మందుల లభ్యత, ఆక్సిజన్ నిల్వలను సమగ్రంగా పరిశీలించారు. సేవల సామర్థ్యాన్ని అంచనా వేయడానికి నెలవారీ కేసుల సగటుపై కూడా వివరాలు సేకరించారు. తనిఖీ అనంతరం సిబ్బందికి మార్గనిర్దేశం చేసిన వెంకటేశ్వర్లు, ప్రమాదాలు లేదా అత్యవసర పరిస్థితుల్లో బాధితులను “గోల్డెన్ అవర్”లోనే సమీప ఆసుపత్రులకు చేర్చడం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం చేయకుండా ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ మేనేజర్ నసీరుద్దీన్, సూపర్వైజర్ దుర్గాప్రసాద్, 108 అంబులెన్స్ సిబ్బంది అనిత, సంపత్ పాల్గొన్నారు. ఈ తనిఖీ ద్వారా అత్యవసర వైద్య సేవల నాణ్యతను మరింత బలోపేతం చేయాలని అధికారులు భావిస్తున్నారు.

వేద న్యూస్

గురువారం ఏప్రిల్ 09, 2026

# సహకార సంఘంలో విధులకు ఎగమానం..!

- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న సెక్రటరీ, కంప్యూటర్ ఆపరేటర్
- వాయిదా పడ్డ మహాజన సభ



**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సెక్రటరీ గంగాధర్, కంప్యూటర్ ఆపరేటర్ విధులకు ఎగమానం చేస్తూ ఇద్దరు కూడా ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతో ఇష్టారాజ్యాంగ వ్యవహరిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఇది ఇలా ఉండగా, సహకార సంఘంలో గతంలో విధులు నిర్వహించిన సెక్రెటరీ లక్ష్మణ్ నిధుల దుర్వినియోగం పై గత నెల 31 వ తేదీన నిర్వహించిన మహాజనసభలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ ను , ప్రస్తుతం ఉన్న సెక్రటరీని రైతులు నీలదీశారు. సెక్రటరీ లక్ష్మణ్ సొసైటీలో నిధుల దుర్వినియోగం విషయంలో అవినీతికి పాల్పడ్డారని రైతులు పేర్కొన్నారు. మహాజనసభ జరిగిన సాయంత్రం గతంలో విధులు నిర్వహించిన సెక్రటరీ లక్ష్మణ్ ను పిలిపించి నిధుల దుర్వినియోగం విషయంపై రైతులు, సొసైటీ మాజీ డైరెక్టర్లు ఆరా తీయగా, ఏప్రిల్ 8వ తేదీన సమావేశం ఏర్పాటు చేసి పూర్తి వివరాలు వెల్లడిస్తారని తెలిపారు. కానీ ఏప్రిల్ 8 వ తేదీ బుధవారం రోజున అసిస్టెంట్ రిజిస్టార్ అంబర్ సింగ్, గతంలో విధులు నిర్వహించిన సెక్రటరీ లక్ష్మణ్, ప్రస్తుత సెక్రటరీ గంగాధర్, కంప్యూటర్ ఆపరేటర్ కూడా అందుబాటులో లేకపోవడంతో సమావేశం వాయిదా పడింది. సహకార సంఘంలో నిధుల దుర్వినియోగంపై పూర్తి విచారణ ఎప్పుడు కొనసాగుతుందోనని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

# పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు బాధితులకు అప్పగించిన ఎస్సై

**వేద న్యూస్, కోటగిరి :**

కోటగిరి మండల పోలీస్ స్టేషన్ పరిధిలో మొబైల్ ఫోన్లను పోగొట్టుకొని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు ఇవ్వగా, పోలీసులు సిఈఐఆర్ పోర్టల్ ద్వారా ఐదు మొబైల్ ఫోన్ లను రికవరీ చేశారు. ఎస్సై సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఎం.అనీల్, మహమ్మద్ ఖాన్, వన్నె రాజు, ప్రకాష్, సురేష్ లకు బుధవారం పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను అప్పగించినట్లు ఎస్సై పేర్కొన్నారు.



# ఘనంగా పాఠశాల దినోత్సవ వేడుకలు

**వేద న్యూస్ ,కారేపల్లి:**

సింగరేణి మండలం విశ్వనాథపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో పాఠశాల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఐదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభను ప్రధానోపాధ్యాయులు భూక్య రాంకోటి రాథోడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి జయరాజు హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుబాటులో ఉంటుందని, అన్ని వసతులు కల్పించబడుతున్నాయని తెలిపారు. గ్రామంలోని ప్రతి విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు గ్రామ సర్పంచ్, పాఠశాల కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. రాబోయే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఇరవై ఒక రకాల వస్తువులతో కూడిన విద్యా సామగ్రి సంచిని ప్రభుత్వం అందజేస్తుందని, అలాగే ఉదయం అల్పాహారం కూడా అందుబాటులో ఉంచనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథపల్లి గ్రామ సర్పంచ్ ఇస్లావత్ రాజు, కోమట్లగూడెం సముదాయం ప్రధానోపాధ్యాయులు శారద, విశ్వనాథపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు మమత, గ్రామ కార్యదర్శి నాగలక్ష్మి, సింగరేణి




మండల ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు అజ్మీరా వీరు నాయక్, ఉపాధ్యాయులు బాసు, బాబు, నాగయ్య, రవి, లక్ష్మి, కమల, మండల వనరుల కేంద్రం సిబ్బంది లక్ష్మణ్, సమూహ వనరుల వ్యక్తులు పరమేష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ప్రభుత్వం అందించే మద్దతు ధర పొందాలి



**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

రైతులు ఐకెపి కేంద్రానికి ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధర పొందాలని తహసిల్దార్ హేమలత అన్నారు. బుధవారం వేములపల్లి మండల కేంద్రంలోని ఆమనగల్ గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని స్థానిక సర్పంచ్ పిల్లల సందీప్, లక్ష్మీదేవి గూడెం సర్పంచ్ ఎలికంటి భరత్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.రైతులు దళారులు నమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వం రైతులకు ఏ రకం ధాన్యానికి 2389 రూపాయలు, సాధారణ ధాన్యం రకానికి 2369 రూపాయలు అందించి కొనుగోలు చేస్తుందన్నారు. రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. కొనుగోలు కేంద్రం సాఫీగా జరిగేటట్లు రైతులు సహకరించాలని కోరారు. రైతులు ధాన్యాన్ని తీసుకు వచ్చేటప్పుడు తేమ శాతం 17 కంటే ఎక్కువగా ఉండేటట్టు చూసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో డిపిఎం సోమయ్య, ఎపిఎం జానకి, ఆర్ ఐ మహేందర్ రెడ్డి,ఏ ఈ ఓ రమేష్, సీసీ గోపి,ఉప సర్పంచ్లు శాలెం రాజు, గంట స్వాతి నరసయ్య, రాష్ట్ర ఐ ఎన్ టి యు సి ఆర్గనైజింగ్ కార్యదర్శి బంటు చొక్కయ్య గౌడ్, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి పత్తిపాటి స్వరాజ్యలక్ష్మి, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, ఐకెపి నిర్వాహకులు కుంచం నాగమణి, హమాలి సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# పల్లెల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం



- మహిళలే కేంద్రంగా ప్రభుత్వ పథకాల అమలు
- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**వేద న్యూస్, గంగాధర:**

తెలంగాణ రాష్ట్రంలో పల్లెల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. గంగాధర మండలంలోని ఇస్లాంపూర్, కోట్ల నరసింహులపల్లి, గర్శకుర్తి గ్రామాల్లో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను ఆయన ప్రారంభించారు. అలాగే గర్శకుర్తి గ్రామంలో రూ.10 లక్షలు, వెంకంపల్లి గ్రామంలో రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. మండలంలోని ఇస్లాంపూర్, మల్లాపూర్, వెంకంపల్లి, మధురానగర్, చర్లపల్లి (ఎన్), బూరుగుపల్లి, కోట్ల నరసింహులపల్లి, గర్శకుర్తి, కురిక్యాల, గట్టుభూత్కూర్ గ్రామాల్లో రూ.10 లక్షల చొప్పున స్వశక్తి సంఘ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. గత ప్రభుత్వం గ్రామపంచాయతీల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కొత్తగా ఏర్పడిన గ్రామపంచాయతీలకు భవనాలు కూడా ఏర్పాటు చేయలేదన్నారు. మహిళలను కేంద్రంగా చేసుకుని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, ప్రతి గ్రామంలో శివశక్తి సంఘ భవనాల నిర్మాణానికి కృషి చేస్తున్నామని తెలిపారు. చొప్పదండి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అంబటి రజిత, ఎంపీడీవో రాము, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ మేయర్‌కు చాంబర్ కేటాయింపు సిగ్గుచేటు

- బీజేపీపై సీపీఐ నాయకుల విమర్శలు




**వేద న్యూస్, కరీంనగర్:**

కరీంనగర్ నగరపాలక సంస్థలో డిప్యూటీ మేయర్‌కు చాంబర్ కేటాయించడం సిగ్గుచేటు చర్య అని సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శులు పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజులు విమర్శించారు. నగరంలో మార్పు తీసుకొస్తామని చెప్పిన బీజేపీ, అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే గత ప్రభుత్వ విధానాలనే అనుసరిస్తోందని ఆరోపించారు. గతంలో డిప్యూటీ మేయర్ చాంబర్ ఏర్పాటును బీజేపీ తీవ్రంగా వ్యతిరేకించిందని, ఇప్పుడు అదే విధానాన్ని అమలు చేయడం ద్వంద్వ వైఖరి అని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. నగరపాలక సంస్థలో మేయర్‌కు మాత్రమే చాంబర్ ఉండాలని, డిప్యూటీ మేయర్‌కు చాంబర్ ఏర్పాటు చేయడానికి ఎలాంటి నిబంధనలు లేవని తెలిపారు. ప్రజాధనాన్ని వృథా చేస్తూ తీసుకున్న ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# పోలీస్ స్టేషన్ సమీపంలో నిప్పంటించుకున్న యువకుడు

- పరిస్థితి విషమం..
- ఓ యువతి విషయమై ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు
- కరీంనగర్‌లో ఘటన..




**వేద న్యూస్, కరీంనగర్:**

కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు పెట్రోల్ పోసుకొని నిప్పు అంటించుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల వివరాల ప్రకారం, కరీంనగర్ మండలానికి చెందిన ఓ యువతి, వరంగల్ జిల్లాకు చెందిన వరుణ్ అనే యువకుడు కొంతకాలంగా పరిచయం నసాగించుకుంటున్నారు. డిజిటల్ యాప్‌ల ద్వారా పరిచయం ఏర్పడిన ఈ యువకుడు, పెళ్లి చేసుకోవాలని తరచూ ఫోన్ చేస్తూ వేధించడంతో యువతి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకుని అతని వివరాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా యువకుడు యువతిని తన వెంట పంపించాలని డిమాండ్ చేసినట్లు సమాచారం. అయితే అదే రాత్రి పోలీస్ స్టేషన్ సమీపంలో యువకుడు పెట్రోల్ పోసుకొని నిప్పు అంటించుకోవడంతో తీవ్ర కలకలం రేగింది. వెంటనే పోలీసులు అతన్ని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యువకుడు ఈ దారుణానికి పాల్పడటానికి కారణాలు ఏమిటి అనే దానిపై చర్చ సాగుతోంది. పోలీసులు విచారణ చేపట్టినట్లు సమాచారం.

# మహిళా ప్రయాణికురాలిపై డ్రైవర్ దురుసు ప్రవర్తన

- చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్

**వేద న్యూస్, కమలాపూర్:**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలానికి చెందిన ఓ మహిళపై బస్సు డ్రైవర్ దురుసుగా ప్రవర్తించిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. బాధితురాలి వివరాల ప్రకారం, కమలాపూర్ నుంచి హనుమకొండ ములుగు క్రాస్ రోడ్‌కు వెళ్తుండగా వేములపల్లి-బంగ్లపెల్లి-వరంగల్ మార్గంలో నడిచే బస్సులో ఆమె ప్రయాణించింది. కండక్టర్ టికెట్ కోరగా ఆమె ఆధార్ కార్డు చూపించగా, అది చెల్లదని చెప్పడంతో డబ్బులు ఇచ్చి టికెట్ తీసుకుంది. ఈ సందర్భంలో సంబంధం లేని డ్రైవర్ మహిళపై దురుసుగా ప్రవర్తిస్తూ అసభ్య పదజాలం ఉపయోగించినట్లు ఆరోపించారు. దీనిపై ప్రశ్నించగా డ్రైవర్ స్పందించలేదని బాధితురాలు తెలిపారు. ఈ ఘటనపై తీవ్ర మనస్థాపానికి గురైన మహిళ, సంబంధిత డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను కోరింది. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేసింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమల్లోకి వచ్చిన తరువాత కొంతమంది సిబ్బంది తీరులో మార్పు అవసరమని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు. మహిళల గౌరవాన్ని కాపాడే విధంగా ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వేద న్యూస్

గురువారం ఏప్రిల్ 09, 2026

# ఈవీఎం గోదాం తనిఖీ చేసిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

- ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నెలవారీ పరిశీలన
- భద్రతా వ్యవస్థలపై సమగ్ర సమీక్ష
- సీసీ కెమెరాలు, అగ్నిమాపక ఏర్పాట్లపై దృష్టి



**వేద న్యూస్ జనగామ :**

భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నెలవారీ తనిఖీల్లో భాగంగా జిల్లా సమీకృత కార్యాలయాల భవన సముదాయంలో ఉన్న ఈవీఎం గోదాంను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్‌తో కలిసి గోదాంలో అమలవుతున్న భద్రతా ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు. పరిశీలనలో భాగంగా గోదాంలోని భద్రతా నమోదు పుస్తకాన్ని కలెక్టర్ పరిశీలించి నమోదులు సక్రమంగా ఉన్నాయా అనే అంశాన్ని ఆరా తీశారు. ఈవీఎంల భద్రత అత్యంత ప్రాధాన్యమైందని, ఎటువంటి లోపాలు లేకుండా పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులకు సూచించారు. సీసీ కెమెరాల పనితీరును ప్రత్యేకంగా పరిశీలించిన కలెక్టర్, అవి ఎప్పటికప్పుడు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. భద్రతా వ్యవస్థలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని పోలీసు సిబ్బందికి సూచించారు. అగ్నిమాపక ఏర్పాట్లను కూడా పరిశీలించి మంటల నియంత్రణ పద్ధతులు సమర్థంగా అమలవుతున్నాయా అనే అంశాన్ని సమీక్షించారు. ఫైర్ అలారంలు, అగ్నిమాపక యంత్రాలు ఎప్పటికప్పుడు సరిచూసుకుంటూ సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, విశ్వసనీయతను కాపాడేందుకు ఈవీఎంల భద్రత అత్యంత కీలకమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల సామగ్రి సంరక్షణలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో జనగామ ఆర్డీఓ గోపీరాం, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీధర్, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎటువంటి లోపాలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు కొనసాగించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు.

# సర్దార్ పోస్ట్ వద్ద జవాన్ల వీరోచిత పోరాటం

- సి.ఆర్.పి.ఎఫ్ శౌర్య దివస్ విశిష్టత
- పాకిస్థాన్ సైన్యంపై చారిత్రాత్మక విజయం
- దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన వీరులకు నివాళి




**వేద న్యూస్ డెస్క్:**

భారతదేశ అంతర్గత భద్రతలో కీలక పాత్ర పోషిస్తున్న కేంద్ర రిజర్వ్ పోలీస్ బలగాల (జవాన్ల) పరాక్రమానికి ప్రతీకగా రేపు 'శౌర్య దివస్'ను దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తారు. 1965 ఏప్రిల్ 9వ తేదీన గుజరాత్‌లోని కచ్ ప్రాంతంలో ఉన్న సర్దార్ పోస్ట్ వద్ద జరిగిన అసాధారణ పోరాటాన్ని స్మరించుకుంటూ ఈ దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. కేవలం రెండు కంపెనీల సి.ఆర్.పి.ఎఫ్ జవాన్లు, సంఖ్యాపరంగా తమకంటే ఎంతో ఎక్కువగా ఉన్న పాకిస్థాన్ పదాతిదళ బ్రిగేడ్‌ను ఎదుర్కొని నిలబడటం సైనిక చరిత్రలోనే ఒక అద్భుత ఘట్టంగా నిలిచిపోయింది. ఈ రోజు మన జవాన్ల గుండె నిబ్బరాన్ని మరియు దేశం పట్ల వారికీ ఉన్న అంకితభావాన్ని చాటిచెబుతుంది. ఈ పోరాట నేపథ్యాన్ని పరిశీలిస్తే, 1965 ఏప్రిల్ 9 తెల్లవారుజామున పాకిస్థాన్ సైన్యం 'ఆపరేషన్ డెసర్ట్ హాక్' పేరుతో భారత భూభాగంలోకి చొరబడటానికి ప్రయత్నించింది. అత్యాధునిక ఆయుధాలతో వచ్చిన శత్రువులను చూసి బెదరకుండా, మన జవాన్లు తమ వద్ద ఉన్న పరిమిత వనరులతోనే సుమారు 12 గంటల పాటు వీరోచితంగా పోరాడారు. ఈ భీకర యుద్ధంలో పాకిస్థాన్ సైన్యానికి భారీ నష్టం వాటిల్లింది, వారిలో 34 మంది సైనికులు మరణించగా, మరో నలుగురు ప్రాణాలతో పట్టుబడ్డారు.

మన వైపు నుంచి ఆరుగురు వీర జవాన్లు మాతృభూమి రక్షణ కోసం తమ ప్రాణాలను త్యాగం చేశారు. జవాన్ల ఈ అసమాన ధైర్యసాహసాలు భారత సైనిక చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోయాయి. సాధారణంగా పోలీసు బలగాలు అంతర్జాతీయ సరిహద్దుల వద్ద శత్రు దేశ సైన్యంతో నేరుగా తలపడటం చాలా అరుదుగా జరుగుతుంది. కానీ సర్దార్ పోస్ట్ వద్ద సి.ఆర్.పి.ఎఫ్ చూపిన పరాక్రమం, వారు ఎంతటి కఠిన పరిస్థితులనైనా ఎదుర్కోగలరని ప్రపంచానికి నిరూపించింది. ఈ విజయానికి గుర్తుగా ప్రతి ఏటా ఏప్రిల్ 9న నిర్వహించే వేడుకలు కొత్త తరం జవాన్లలో స్ఫూర్తిని నింపుతాయి. అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ వారికి గౌరవ వందనం సమర్పించడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యం. ప్రస్తుత తరుణంలో దేశం ఎదుర్కొంటున్న అంతర్గత మరియు బాహ్య సవాళ్లను ఎదుర్కోవడంలో సి.ఆర్.పి.ఎఫ్ ముందు వరుసలో ఉంటోంది. నక్సలిజం ప్రభావిత ప్రాంతాల్లో, ఉగ్రవాద వ్యతిరేక పోరాటాల్లో మరియు ఎన్నికల నిర్వహణలో ఈ బలగాల సేవలు వెలకట్టలేనివి.

ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు కూడా సామాన్య ప్రజలను ఆదుకోవడంలో జవాన్లు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారు. శౌర్య దివస్ కేవలం ఒక వేడుక మాత్రమే కాదు, అది దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడటంలో ప్రాణాలర్పించిన ప్రతి ఒక్క వీరుడికి మనం ఇచ్చే అత్యున్నత గౌరవం. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న సి.ఆర్.పి.ఎఫ్ క్యాంపుల్లో ప్రత్యేక కార్యక్రమాలు, కవాతులు నిర్వహిస్తారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన జవాన్లకు పురస్కారాలు అందజేసి వారిని గౌరవిస్తారు. పాఠశాలలు మరియు కళాశాలల్లో దేశభక్తిని పెంపొందించే ప్రసంగాలు, వ్యాస రచన పోటీలు నిర్వహించి యువతకు మన వీరుల గాథలను వివరిస్తారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లో భద్రతా దళాల పట్ల గౌరవం పెరగడమే కాకుండా, దేశ రక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందనే అవగాహన కలుగుతుంది.

# 'దుర్గ' ఆసుపత్రిలో ప్రముఖ గుండె వైద్య నిపుణులు

## - పేషెంట్స్ కు తగు ట్రీట్మెంట్ అందించిన డాక్టర్ సురేష్ కుమార్





**వేద న్యూస్, జమ్మికుంట:**

కొండూరి కాంప్లెక్స్ జమ్మికుంట పట్టణంలోని దుర్గ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో బుధవారం మధ్యాహ్నం 1 గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు ప్రముఖ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ , గుండె వైద్య నిపుణులు డా. కే సురేష్ కుమార్ అందుబాటులో ఉండి.. పలువురు గుండె సంబంధిత అనారోగ్యమున్న పేషెంట్స్ ను చూసి తగు ట్రీట్మెంట్ అందించారు. తమ అనారోగ్య సమస్యను తెలుసుకొని స్పష్టంగా పలు సూచనలు, సలహాలు ఇచ్చి.. చక్కటి ట్రీట్మెంట్ డాక్టర్ సురేష్ కుమార్ ఇచ్చారని పేషెంట్స్ వెల్లడించారు. కాగా, జమ్మికుంట పట్టణ, మండల, పరిసర ప్రాంత ప్రజలు గుండె సంబంధిత అనారోగ్యం విషయమై వైద్యం కోసం సుదూర ప్రాంతాలైన కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ వంటి పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, ఇకనుంచి ప్రతి నెల 2వ, 4వ బుధవారం ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ సురేష్ కుమార్ దుర్గ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో అందుబాటులో ఉంటారని ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ పి. కిరణ్ గౌడ్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9059337824, 9866237824, 9652790784.. ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చని స్పష్టం చేశారు.

# గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం



**వేద న్యూస్ జగిత్యాల:**

- జగిత్యాల జిల్లాలో ప్రత్యేక చర్యలు
- పోషకాహారం, నియమిత పరీక్షలపై దృష్టి
- సాధారణ ప్రసవాలకు ప్రోత్సాహం
- ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచన

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జగిత్యాల జిల్లాలో గర్భిణీ స్త్రీలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గర్భిణీలు అనుసరించాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు, పోషకాహారం, నియమిత వైద్య పరీక్షలు, ప్రసవానికి ముందస్తు ఏర్పాట్లపై వైద్యులు సమగ్రంగా వివరించారు. గర్భధారణ సమయంలో తల్లి మరియు శిశువు ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న సేవలను తప్పనిసరిగా వినియోగించుకోవాలని వైద్యులు సూచించారు. సాధ్యమైనంతవరకు సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, వైద్యుల సూచనలు పాటించడం ద్వారా ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ గర్భిణీ మహిళలు సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవడం అత్యంత అవసరమని తెలిపారు. ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు క్రమం తప్పకుండా తీసుకోవడం, పోషకాహారం తీసుకోవడం ద్వారా తల్లి మరియు శిశువు ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను పూర్తిగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా అనవసర శస్త్రచికిత్సలను తగ్గించవచ్చని, ఇది తల్లి ఆరోగ్యానికి మేలు చేస్తుందని వివరించారు. గర్భిణీలు వైద్యుల పర్యవేక్షణలో ఉండాలని సూచించారు. జిల్లాలో గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న సేవలను మరింత బలోపేతం చేయాలని వైద్యాధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ప్రతి గర్భిణీకి సమయానికి పరీక్షలు, సలహాలు అందేలా పర్యవేక్షణ పెంచాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా సేవలు సమర్థంగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సుజాత, డిప్యూటీ డీఎంహెచ్ఓ జైపాల్ రెడ్డి, సూపరిండెంట్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. తల్లి, శిశు ఆరోగ్య పరిరక్షణలో ఇలాంటి కార్యక్రమాలు కీలకమని అధికారులు తెలిపారు.

# మద్యం మత్తులో ర్యాష్ డ్రైవింగ్.. కారు ఢీకొని ముగ్గురు యువకులు మృతి


**వేద న్యూస్ హైదరాబాద్ :**



నగరంలో మరో దారుణ రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఉన్న ఓ కారు డ్రైవర్ నియంత్రణ కోల్పోయి ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ముగ్గురు యువకుల ప్రాణాలు బలి తీసుకున్న ఘటన హస్తినాపురం ప్రాంతంలో తీవ్ర కలకలం రేపింది. వేగంగా దూసుకెళ్లిన కారు ముందుగా ఓ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఆ తర్వాత రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మరో యువకుడిని ఢీకొట్టి, వారిని సుమారు 100 మీటర్ల దూరం వరకు ఈడ్చుకెళ్లింది. అనంతరం కారు అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ భయానక ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు, అలాగే రోడ్డుపై నడుస్తున్న మరో యువకుడు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో ఇద్దరిని మహవీర్ ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన బీటెక్ విద్యార్థులు శివ, సందీప్‌గా గుర్తించారు. ఈ ఘటనతో కుటుంబాల్లో విషాదం నెలకొంది. ప్రమాద సమాచారం తెలుసుకున్న స్థానికులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఘటనాస్థలికి చేరుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. డ్రైవర్‌ను తమకు అప్పగించాలని నినాదాలు చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి గల అసలు కారణాలు, డ్రైవర్ మద్యం మత్తులో ఉన్న స్థితి వంటి అంశాలను విచారిస్తున్నారు. ఈ ఘటనతో మరోసారి మద్యం మత్తులో డ్రైవింగ్ చేసే వారి నిర్లక్ష్యం ఎంతటి విషాదాలకు దారి తీస్తుందో స్పష్టమైంది. ప్రజలు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని పోలీసులు సూచిస్తున్నారు.

# పెళ్లికి 5 రోజులు.. యువకుడి ఆత్మహత్య కలకలం

**వేద న్యూస్ హైదరాబాద్ :**



పెళ్లి సంబరాలు మొదలవ్వాల్సిన ఇంట్లో విషాదం నెలకొంది. మరో ఐదు రోజుల్లో పెళ్లి జరగాల్సిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నగరంలోని కొండాపూర్ ప్రాంతంలో తీవ్ర కలకలం రేపింది. మై హోమ్ మంగళ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న వెంకట కృష్ణసాయి అనే యువకుడికి ఇటీవలే వివాహం నిశ్చయమైంది. అయితే పెళ్లికి కేవలం ఐదు రోజులు మాత్రమే మిగిలి ఉన్న సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకోవడం కుటుంబ సభ్యులను, బంధువులను షాక్‌కు గురిచేసింది. ఆత్మహత్యకు ముందు కృష్ణసాయి తన సోదరుడికి ఒక మెయిల్ పంపినట్లు సమాచారం. ఆ మెయిల్ చూసిన సోదరుడు వెంటనే ఇంటికి చేరుకుని పలుమార్లు తలుపులు తట్టినా ఎలాంటి స్పందన రాకపోవడంతో అనుమానం వచ్చి తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లాడు. అక్కడ కృష్ణసాయి గొంతు కోసుకుని అపస్మారక స్థితిలో పడిఉండటం చూసి షాక్‌కు గురయ్యాడు. తక్షణమే అతడిని ఆస్పత్రికి తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇటీవల విశాఖపట్నంలో ప్రముఖ హోటల్‌లో అతని నిశ్చితార్థం ఘనంగా జరిగినట్లు సమాచారం. ఈ సంఘటనతో కుటుంబ సభ్యులు, స్నేహితులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఈ ఘటనపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. యువకుడు ఈ ఘోర నిర్ణయం తీసుకోవడానికి గల కారణాలపై వివిధ కోణాల్లో విచారణ చేపడుతున్నారు. వ్యక్తిగత సమస్యలే కారణమా, లేక మరే ఇతర కారణాలున్నాయా అన్న దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ ఘటనతో మరోసారి యువతలో పెరుగుతున్న మానసిక ఒత్తిళ్లపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# పాక్ క్రికెటర్లకు పదేళ్లు పట్టింది..

## కట్ చేస్తే.. 6 బంతుల్లోనే బుమ్రాను తగలబెట్టేశాడు

**వేద న్యూస్ డెస్క్:**



ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్, ముంబై ఇండియన్స్ మధ్య జరిగిన మ్యాచ్ క్రికెట్ ప్రపంచానికి ఒక అద్భుతమైన అనుభూతిని అందించింది. ఈ మ్యాచ్‌లో కేవలం 15 ఏళ్ల వయసున్న యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ తన దూకుడు బ్యాటింగ్‌తో అందరినీ మంత్ర ముగ్ధులను చేశాడు. ప్రపంచంలోనే అత్యుత్తమ బౌలర్లలో ఒకడైన జస్ప్రీత్ బుమ్రాను ఎలాంటి ఒత్తిడి లేకుండా ఎదుర్కొని, తొలి బంతినే భారీ సిక్సర్‌గా మలచడం మ్యాచ్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వర్షం కారణంగా ఆలస్యంగా ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. అయితే రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్లు మొదటి నుంచే దూకుడు ప్రదర్శిస్తూ ముంబై బౌలర్లపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారు. ముఖ్యంగా యశస్వి జైస్వాల్ తన అద్భుతమైన షాట్లతో స్కోరును వేగంగా ముందుకు నడిపించాడు. మొదటి ఓవర్లోనే భారీ పరుగులు రాబట్టి జట్టుకు బలమైన పునాది వేశాడు. కానీ అసలు సంచలనం వైభవ్ సూర్యవంశీ క్రీజులోకి అడుగుపెట్టిన తర్వాతే ప్రారంభమైంది. జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్‌కు వచ్చినప్పుడు సాధారణంగా బ్యాట్స్‌మెన్లు జాగ్రత్తగా ఆడతారు. కానీ వైభవ్ మాత్రం భిన్నంగా ఆలోచించాడు. అతని ధైర్యం, ఆత్మవిశ్వాసం ఒక్క షాట్‌లోనే కనిపించింది. బుమ్రా వేసిన తొలి బంతినే మిడ్ ఆన్ మీదుగా స్టాండ్స్‌లోకి పంపి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశాడు. ఆ షాట్‌తో అతను తన ఉద్దేశాన్ని స్పష్టంగా తెలియజేశాడు ఎలాంటి బౌలర్ అయినా తాను వెనక్కి తగ్గనని. అంతటితో ఆగకుండా బుమ్రా, ట్రెంట్ బౌల్ట్, శార్దూల్ ఠాకూర్ వంటి అనుభవజ్ఞులైన బౌలర్లపై వరుసగా సిక్సర్లు బాదుతూ మ్యాచ్ గమనాన్ని పూర్తిగా మార్చేశాడు. కేవలం 14 బంతుల్లోనే ఐదు భారీ సిక్సర్లు, ఒక ఫోర్‌తో 39 పరుగులు చేసి ఔటైనా, అతని ఇన్నింగ్స్ మ్యాచ్‌పై భారీ ప్రభావం చూపింది. అతని దూకుడు ఆట రాజస్థాన్ జట్టుకు భారీ స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించింది. ఇక యశస్వి జైస్వాల్ అద్భుతంగా ఆడుతూ 77 పరుగులతో నాటౌట్‌గా నిలవడంతో రాజస్థాన్ రాయల్స్ 150 పరుగుల బలమైన స్కోరు నమోదు చేసింది. లక్ష్య ఛేధనలో ముంబై ఇండియన్స్ జట్టు రాజస్థాన్ బౌలర్ల దాడిని తట్టుకోలేకపోయింది. కేవలం 11 ఓవర్లలోనే 123 పరుగులకు 9 వికెట్లు కోల్పోయి పరాజయం పాలైంది. దీంతో రాజస్థాన్ జట్టు 27 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్ అనంతరం ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైకిల్ క్లార్క్ వైభవ్ సూర్యవంశీపై ప్రశంసల వర్షం కురిపించాడు. బుమ్రా లాంటి ప్రపంచ స్థాయి బౌలర్‌ను ఎదుర్కొనే ధైర్యం ప్రతి ఒక్కరికీ ఉండదని, కానీ వైభవ్ చూపించిన ఆత్మవిశ్వాసం అసాధారణమని పేర్కొన్నాడు. అతని బ్యాటింగ్ చూస్తుంటే వీడియో గేమ్ ఆడుతున్నట్లుగా అనిపిస్తోందని, క్రీజులో ఉన్న కొద్ది సమయానికే మ్యాచ్‌ను పూర్తిగా మార్చగల శక్తి అతనిలో ఉందని కొనియాడాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే ఇలాంటి ప్రదర్శన చేయడం క్రికెట్ చరిత్రలో అరుదైన విషయం అని క్లార్క్ అభిప్రాయపడ్డాడు. భవిష్యత్తులో అతను ప్రపంచ క్రికెట్‌లో అగ్రస్థానానికి చేరే సామర్థ్యం కలిగిన ఆటగాడని పేర్కొన్నాడు. అతని ఆటతీరులో ఉన్న దూకుడు, ఆత్మవిశ్వాసం యువ ఆటగాళ్లకు స్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పాడు. ఇదిలా ఉంటే సోషల్ మీడియాలో నెటిజన్లు కూడా ఆసక్తికర వ్యాఖ్యలు చేస్తున్నారు. పాక్ క్రికెటర్లు జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లో సిక్సర్లు కొట్టడానికి ఏళ్ల తరబడి సమయం తీసుకున్నారని, కానీ వైభవ్ మాత్రం కేవలం ఆరు బంతుల్లోనే బుమ్రాను చిత్తు చేశాడని కామెంట్లు చేస్తున్నారు. ఈ పోలికలు ప్రస్తుతం నెట్లో వైరల్‌గా మారాయి. మొత్తంగా చూస్తే, వైభవ్ సూర్యవంశీ ప్రదర్శన ఐపీఎల్ 2026లోనే కాదు, ప్రపంచ క్రికెట్‌లో కూడా ఒక ప్రత్యేక సంఘటనగా నిలిచింది. అతని ధైర్యం, దూకుడు, ఆత్మవిశ్వాసం భవిష్యత్తులో భారత క్రికెట్‌కు కొత్త దిశను చూపించగలవని నిపుణులు భావిస్తున్నారు. ఈ చిన్న వయసులోనే ఇంతటి ప్రభావం చూపించడం అతని ప్రతిభకు నిదర్శనం. ముందున్న రోజుల్లో అతను ఇంకా ఎలాంటి సంచలనాలు సృష్టిస్తాడో అన్న ఆసక్తి క్రికెట్ అభిమానుల్లో పెరుగుతోంది.

## చెన్నైకి కోలుకోలేని దెబ్బ.. ఫిట్‌నెస్ సమస్యతో ధోనీ దూరం!



**వేద న్యూస్ డెస్క్:**

ఐపీఎల్ తాజా సీజన్‌లో ఇప్పటివరకు ఒక్క విజయాన్ని కూడా నమోదు చేయలేకపోయిన చెన్నై జట్టుకు మరో పెద్ద షాక్ తగిలింది. జట్టు అనుభవజ్ఞుడైన స్టార్ ఆటగాడు మహేంద్ర సింగ్ ధోనీ ఫిట్‌నెస్ సమస్యల కారణంగా తాత్కాలికంగా జట్టుకు దూరమయ్యాడనే వార్త అభిమానుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే వరుస పరాజయాలతో ఒత్తిడిలో ఉన్న చెన్నైకు ఇది కోలుకోలేని దెబ్బగా భావిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం ధోనీ ప్రస్తుతం రిహాబిలిటేషన్‌లో ఉన్నాడు. గాయం పూర్తిగా తగ్గి మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించడానికి కనీసం మరో వారం రోజులు పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. జట్టులో అతని అనుభవం, కీపింగ్ నైపుణ్యం, కీలక సమయాల్లో తీసుకునే నిర్ణయాలు చెన్నైకి ఎంతో ముఖ్యమైనవి. అలాంటి ఆటగాడు దూరమవడం జట్టు సమతూకాన్ని దెబ్బతీస్తుందని క్రికెట్ నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుతం చెన్నై జట్టు పరిస్థితి క్లిష్టంగా మారింది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో స్థిరత్వం లేకపోవడం వల్ల విజయాలు అందుకోలేకపోతోంది. ఇలాంటి సమయంలో ధోనీ లాంటి సీనియర్ ప్లేయర్ లేకపోవడం మరింత సమస్యగా మారింది. యువ ఆటగాళ్లపై బాధ్యతలు పెరగడంతో జట్టు ప్రదర్శన ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది.అయితే చెన్నై యాజమాన్యం మాత్రం ధోనీ త్వరలోనే తిరిగి బరిలోకి దిగుతాడనే నమ్మకంతో ఉంది. అన్ని అనుకూలిస్తే ఏప్రిల్ 18న హైదరాబాద్ వేదికగా జరిగే మ్యాచ్‌లో ఆయన తిరిగి ఆడే అవకాశం ఉందని సమాచారం. ఆ మ్యాచ్ వరకు జట్టు ఎలా ఆడుతుంది, గెలుపు ఖాతా ఎప్పుడు తెరుస్తుందనేది ఇప్పుడు అభిమానుల్లో చర్చనీయాంశంగా మారింది. మొత్తంగా చూసుకుంటే చెన్నై జట్టు కోసం రాబోయే రోజులు కీలకంగా మారాయి. ధోనీ రీఎంట్రీపై అందరి చూపులు నిలిచిపోయాయి. అతను తిరిగి వచ్చి జట్టును గెలుపు బాట పట్టిస్తాడా లేదా అనేది ఆసక్తిగా మారింది.

## వైభవ్‌ని టీమిండియాలోకి తీసుకోండి.. బీసీసీఐకి ఇర్ఫాన్ పఠాన్ సూచన



**వేద న్యూస్ డెస్క్:**

ఐపీఎల్ 2026లో సంచలన ప్రదర్శనలతో దేశవ్యాప్తంగా క్రికెట్ అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్న యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీపై ప్రశంసల వర్షం కురుస్తోంది. కేవలం 15 ఏళ్ల వయసులోనే అత్యుత్తమ బౌలర్లను ధైర్యంగా ఎదుర్కొంటూ మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడుతున్న ఈ బీహార్ కుర్రాడిని వెంటనే భారత జట్టులోకి తీసుకోవాలని మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ బీసీసీఐకి సూచించారు. వైభవ్ ప్రతిభపై స్పందించిన ఇర్ఫాన్ పఠాన్, ఈ చిన్న వయసులోనే అతను చూపిస్తున్న ఆట అసాధారణమని పేర్కొన్నారు. వైట్ బాల్ క్రికెట్‌లో ఇలాంటి దూకుడు, ధైర్యం చాలా అరుదుగా కనిపిస్తాయని, అతను ప్రత్యేకమైన ప్రతిభ కలిగిన ఆటగాడని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ప్రపంచ స్థాయి బౌలర్ జస్ప్రీత్ బుమ్రాను ఎదుర్కొనే విషయంలో చూపించిన నిబ్బరం అతని స్థాయిని తెలియజేస్తుందని అన్నారు. మ్యాచ్‌కు ముందే బుమ్రాను టార్గెట్‌గా పెట్టుకుని, అతని బౌలింగ్‌పై దాడి చేయాలని నిర్ణయించుకున్నాడని పఠాన్ తెలిపారు. "గత ఏడాది అవుటయ్యాను.. ఈసారి వచ్చి బాదుతాను" అని చెప్పినట్లే, మ్యాచ్‌లో తొలి బంతినే సిక్సర్‌గా మలిచి తన మాట నిలబెట్టుకున్నాడని చెప్పారు. ఇలాంటి ఆత్మవిశ్వాసం, దూకుడు ఉన్న ఆటగాళ్లు చాలా అరుదుగా ఉంటారని పేర్కొన్నారు. ఇలాంటి ప్రతిభావంతుడైన యువ ఆటగాడిని ఎక్కువకాలం నిరీక్షణలో పెట్టకుండా వెంటనే జాతీయ జట్టులోకి తీసుకోవడం మంచిదని పఠాన్ సూచించారు.


## షమీని జట్టులోకి తీసుకోండి.. సౌరవ్ గంగూలీ కీలక వ్యాఖ్యలు

**వేద న్యూస్ డెస్క్:**



భారత క్రికెట్ జట్టుకు అనుభవజ్ఞుడైన పేసర్ మహమ్మద్ షమీని వెంటనే తిరిగి జట్టులోకి తీసుకోవాలని మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ సెలక్టర్లకు సూచించారు. ప్రస్తుతం అతను చూపిస్తున్న ఫామ్, ఫిట్‌నెస్ దృష్ట్యా జట్టుకు అతని సేవలు అత్యంత అవసరమని గంగూలీ పేర్కొన్నారు. ఒక కార్యక్రమంలో మాట్లాడిన గంగూలీ, షమీ ప్రస్తుత ప్రదర్శనపై ప్రశంసలు కురిపించారు. ముఖ్యంగా ఐపీఎల్‌లో అతను అద్భుతంగా బౌలింగ్ చేస్తూ తన సామర్థ్యాన్ని మరోసారి నిరూపిస్తున్నాడని తెలిపారు. అనుభవం, నియంత్రణ, కీలక సమయాల్లో వికెట్లు తీసే సామర్థ్యం ఉన్న షమీ లాంటి బౌలర్ జట్టులో ఉంటే బౌలింగ్ దళం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు అదే సమయంలో జస్ప్రీత్ బుమ్రాతో కలిసి షమీ కొత్త బంతిని పంచుకుంటే ప్రపంచంలోని ఏ బ్యాటింగ్ లైనప్‌నైనా ఇబ్బంది పెట్టగలరని గంగూలీ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ జోడీ మైదానంలో ఉంటే ప్రత్యర్థి జట్లపై తీవ్ర ఒత్తిడి పడుతుందని ఆయన అన్నారు.గాయం నుంచి కోలుకున్న తర్వాత షమీ తీసుకున్న నిర్ణయాన్ని కూడా గంగూలీ సమర్థించారు. నేరుగా అంతర్జాతీయ క్రికెట్‌లోకి రావడానికి బదులుగా రంజీ ట్రోఫీలో ఆడి ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవడం సరైన నిర్ణయమని చెప్పారు. దేశవాళీ మ్యాచ్‌లు ఆడడం వల్ల అతను తన లయను తిరిగి అందుకుంటాడని, బౌలింగ్‌పై మరింత పట్టు సాధిస్తాడని పేర్కొన్నారు. త్వరలోనే షమీ మళ్లీ భారత జట్టులోకి చేరి, నీలి జెర్సీలో కనిపించి జట్టుకు విజయాలు అందించాలనే ఆశాభావం వ్యక్తం చేశారు. అతని రీఎంట్రీతో భారత బౌలింగ్ దళం మరింత శక్తివంతంగా మారుతుందని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి.

## దిగ్గజ క్రికెటర్ రవిశాస్త్రికి అరుదైన గౌరవం



**వేద న్యూస్ డెస్క్:**

భారత క్రికెట్ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించిన దిగ్గజ ఆల్‌రౌండర్, మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రికి అరుదైన గౌరవం దక్కింది. ముంబై క్రికెట్ అసోసియేషన్ ప్రతిష్టాత్మక వాంఖడే స్టేడియంలో ఒక స్టాండ్‌కు ఆయన పేరు పెట్టాలని నిర్ణయించడం భారత క్రికెట్‌లో ఆయన సేవలకు దక్కిన గొప్ప గుర్తింపుగా భావిస్తున్నారు. ప్రెస్ బాక్స్ కింద ఉన్న లెవల్ 1 స్టాండ్‌ను ఇకపై 'రవిశాస్త్రి స్టాండ్'గా పిలవనున్నారు. ఆటగాడిగా, కెప్టెన్‌గా, కోచ్‌గా, వ్యాఖ్యాతగా దాదాపు నాలుగు దశాబ్దాల పాటు భారత క్రికెట్‌కు విశేష సేవలు అందించిన రవిశాస్త్రి కృషిని గుర్తిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ముంబై క్రికెట్ అసోసియేషన్ తెలిపింది. ఆయన కెరీర్‌లో ప్రతీ దశలోనూ భారత జట్టుకు కీలకంగా నిలిచిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. మైదానంలో ఆటగాడిగా తన ప్రతిభతో మెప్పించిన ఆయన, కోచ్‌గా కూడా భారత జట్టును ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో ముఖ్య పాత్ర పోషించారు. ఈ గౌరవ కార్యక్రమం సందర్భంగా ముంబైకి చెందిన మరికొంత మంది క్రికెట్ దిగ్గజాలను కూడా సత్కరించనున్నారు. మహిళా క్రికెట్ మాజీ కెప్టెన్ డయానా ఎడుల్జీ పేరును వాంఖడే స్టేడియంలోని గేట్ నంబర్ 5కు కేటాయించగా, దివంగత బ్యాటింగ్ దిగ్గజం దిలీప్ సర్దేశాయ్ పేరును గేట్ నంబర్ 3కు నిర్ణయించారు. అలాగే అద్భుతమైన ఫీల్డర్‌గా గుర్తింపు పొందిన ఏకనాథ్ సోల్కర్ పేరును గేట్ నంబర్ 6కు కేటాయించడం జరిగింది. ఈ కార్యక్రమం క్రికెట్ అభిమానులకు ఒక ప్రత్యేక క్షణంగా నిలిచే అవకాశం ఉంది. రవిశాస్త్రి తన ఆట జీవితంలో ఎన్నో అరుదైన ఘనతలు సాధించారు. ముంబై తరఫున ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఒకే ఓవర్‌లో ఆరు సిక్సర్లు బాదిన తొలి భారత ఆటగాళ్లలో ఒకరిగా గుర్తింపు పొందారు. అలాగే 1983లో భారతదేశం ప్రపంచకప్ గెలిచిన చారిత్రాత్మక జట్టులో కీలక సభ్యుడిగా ఉండటం ఆయన కెరీర్‌లో మరపురాని ఘట్టం. అంతర్జాతీయ క్రికెట్‌లో 80 టెస్టులు, 150 వన్డేలు ఆడిన ఆయన దాదాపు 7 వేల పరుగులు చేయడంతో పాటు 280 వికెట్లు సాధించి ఆల్‌రౌండర్‌గా తన ప్రతిభను చాటుకున్నారు. మైదానంలోనూ, మైదానం వెలుపలనూ తన ప్రత్యేక నిలిచిపోతాయి. ఇప్పుడు వాంఖడే స్టేడియంలో ఆయన పేరుతో స్టాండ్ ఏర్పాటవడం, రాబోయే తరాలకు ఆయన వారసత్వాన్ని గుర్తు చేసేలా ఉంటుంది.

## పర్పుల్ క్యాప్ వేటలో ఐదుగురు.. అగ్రస్థానంలో బీసీసీఐకి నచ్చనోడు..!

**వేద న్యూస్ డెస్క్:**




ఐపీఎల్ 2026 సీజన్ రోజురోజుకూ మరింత ఉత్కంఠభరితంగా మారుతోంది. బ్యాటర్లు పరుగుల వర్షం కురిపిస్తుంటే, బౌలర్లు వికెట్లతో తమ ప్రతిభను చాటుతున్నారు. ముఖ్యంగా టోర్నీలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌కు లభించే ప్రతిష్టాత్మక పర్పుల్ క్యాప్ కోసం పోటీ హోరాహోరీగా సాగుతోంది. ప్రస్తుతం ఐదుగురు బౌలర్లు ఈ రేసులో ముందంజలో నిలిచి, అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నారు. ఈ జాబితాలో అగ్రస్థానంలో భారత యువ స్పిన్నర్ రవి బిష్ణోయ్ నిలిచాడు. రాజస్థాన్ జట్టు తరఫున ఆడుతున్న అతను ఈ సీజన్‌లో నిలకడైన ప్రదర్శన కనబరుస్తూ మూడు మ్యాచ్‌ల్లోనే ఏడు వికెట్లు సాధించాడు. అతని సగటు 11.71గా ఉండగా, ఎకానమీ 9.11గా ఉంది. తన స్పిన్ మాయాజాలంతో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెడుతూ పర్పుల్ క్యాప్ రేసులో అందరికంటే ముందంజలో కొనసాగుతున్నాడు. రెండో స్థానంలో అదే రాజస్థాన్ జట్టుకు చెందిన దక్షిణాఫ్రికా ఫాస్ట్ బౌలర్ నంద్రే బర్గర్ ఉన్నాడు. అతను తన వేగంతో బ్యాటర్లను కట్టడి చేస్తూ ఐదు వికెట్లు పడగొట్టాడు. అతని సగటు 15.20 కాగా, ఎకానమీ రేటు 8.44గా ఉంది. రాజస్థాన్ జట్టుకు చెందిన ఇద్దరు బౌలర్లు తొలి రెండు స్థానాల్లో ఉండటం ఆ జట్టు బౌలింగ్ దళం బలాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది. మూడో స్థానంలో పంజాబ్ జట్టు తరఫున ఆడుతున్న వైశాఖ్ విజయ్ కుమార్ ఉన్నాడు. 29 ఏళ్ల ఈ బౌలర్ మూడు మ్యాచ్‌ల్లో ఐదు వికెట్లు సాధించి తన ప్రతిభను నిరూపించాడు. అతని సగటు 14.40గా ఉండటం విశేషం. అదే సమయంలో నాలుగో స్థానంలో న్యూజిలాండ్‌కు చెందిన జాకబ్ డఫీ నిలిచాడు. బెంగళూరు జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ బౌలర్ కేవలం రెండు మ్యాచ్‌ల్లోనే ఐదు వికెట్లు సాధించడం గమనార్హం. ఇక ఐదో స్థానంలో చెన్నై జట్టు యువ బౌలర్ అన్షుల్ కంబోజ్ ఉన్నాడు. మూడు ఇన్నింగ్స్‌ల్లో బౌలింగ్ చేసి ఐదు వికెట్లు తీసిన ఈ యువకుడు తన ప్రతిభతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. అతని సగటు 24.40గా ఉంది. యువ ఆటగాళ్లు కూడా ఈ రేసులో నిలవడం ఈ సీజన్ ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. ప్రస్తుతం ఈ ఐదుగురు బౌలర్లు పర్పుల్ క్యాప్ కోసం గట్టి పోటీ ఇస్తున్నప్పటికీ, టోర్నీలో ఇంకా చాలా మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. కాబట్టి రాబోయే రోజుల్లో ఈ జాబితాలో మార్పులు రావడం ఖాయం. ప్రతి మ్యాచ్‌తో ఈ పోటీ మరింత ఉత్కంఠగా మారుతుండటంతో, చివరకు పర్పుల్ క్యాప్ ఎవరి తలపై నిలుస్తుందో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

వేద న్యూస్

గురువారం ఏప్రిల్ 09, 2026

# 'రాకా'లుక్‌పై చర్చ




**వేద న్యూస్ డెస్క్:**

అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కుతున్న 'రాకా' చిత్రానికి సంబంధించిన తొలి రూపం విడుదలై సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. పుష్ప విజయానంతరం అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ భారీ చిత్రంపై దేశవ్యాప్తంగా అంచనాలు నెలకొన్నాయి. నటుడి జన్మదినం సందర్భంగా చిత్రబృందం ఈ సినిమాకు 'రాకా' అనే పేరును ప్రకటిస్తూ తొలి రూపాన్ని విడుదల చేసింది. ఈ రూపంలో అల్లు అర్జున్ పూర్తిగా భిన్నమైన అవతారంలో కనిపిస్తూ అభిమానులను ఆకట్టుకున్నారు. ఈ రూపంలో ఆయన గుండుతో, కళ్లకు కాటుకతో, భయంకరమైన తీరు కలిగిన వేషధారణలో దర్శనమిచ్చారు. ముఖ్యంగా చేతుల ఆకృతి, పెద్ద గోర్లు చిత్రానికి ప్రత్యేకతను తెచ్చాయి. ఈ అంశాలు చూస్తుంటే కథ ఫాంటసీ లేదా విజ్ఞాన శాస్త్ర నేపథ్యంతో ఉండవచ్చని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ రూపం విడుదలైన వెంటనే కొందరు సామాజిక మాధ్యమాల్లో విమర్శలు కూడా చేశారు. గతంలో వచ్చిన ఒక చిత్రంలోని పాత్రతో పోలికలు ఉన్నాయని కొందరు వ్యాఖ్యానించారు. దీనిపై అభిమానులు మాత్రం తమ నటుడికి మద్దతుగా నిలుస్తున్నారు. ఇది కేవలం తొలి రూపం మాత్రమేనని, సినిమాలో అసలు రూపం ఇంకా చూడాల్సి ఉందని చెబుతున్నారు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ భారీ వ్యయంతో నిర్మిస్తోంది. కథానాయికగా ప్రముఖ నటి నటిస్తున్నట్లు సమాచారం. పునర్జన్మల నేపథ్యంతో మిస్టరీ ప్రధానంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం కోసం ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది వేసవిలో ఈ చిత్రాన్ని విడుదల చేయాలని చిత్రబృందం భావిస్తోంది.

# బ్రేకప్‌పై కృతి శెట్టి ఓపెన్

**వేద న్యూస్ డెస్క్:**



నటి కృతి శెట్టి తాజాగా చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లోనే కాకుండా అభిమానుల్లో కూడా పెద్ద చర్చకు దారితీశాయి. ప్రేమ, వ్యక్తిగత జీవితం వంటి అంశాలపై ఆమె ఓపెన్‌గా మాట్లాడడం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తాను ప్రస్తుతం సింగిల్‌గా ఉన్నానని స్పష్టంగా చెప్పిన కృతి, గతంలో ఒకసారి ప్రేమలో విఫలమయ్యానని, ఆ విషయాన్ని తన తల్లితో కూడా పంచుకున్నానని వెల్లడించింది. వ్యక్తిగత అనుభవాలను ఇంత బహిరంగంగా చెప్పడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఉప్పెన సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన కృతి శెట్టి, తొలి చిత్రంతోనే అద్భుత విజయాన్ని అందుకుని ఒక్కసారిగా స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. ఆ సినిమాలో ఆమె నటన, అందం ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో వరుసగా అవకాశాలు దక్కించుకుంది. అనంతరం వచ్చిన సినిమాల్లో కూడా తనదైన నటనతో మంచి గుర్తింపు సంపాదించింది. అయితే కొన్నిచిత్రాలు ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో ఆమె కెరీర్ కొంత మందగించింది. అయినప్పటికీ అవకాశాలను కోల్పోకుండా ఇతర భాషల సినిమాల్లో కూడా అడుగుపెడుతూ తన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. ఇటీవల ఒక సినిమా ప్రమోషన్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా కృతి తన వ్యక్తిగత జీవితం గురించి స్పందించింది. ప్రేమలో ఎదురైన అనుభవాల గురించి మాట్లాడుతూ, బ్రేకప్ తనను మానసికంగా ప్రభావితం చేసినప్పటికీ, ఆ అనుభవం తనను మరింత బలంగా మార్చిందని తెలిపింది. జీవితంలో ఇలాంటి సంఘటనలు సహజమేనని, వాటి నుంచి నేర్చుకుని ముందుకు సాగాలని అభిప్రాయపడింది. తనపై వచ్చే విమర్శలను కూడా ఆమె ప్రస్తావిస్తూ, సోషల్ మీడియాలో అనవసరంగా విమర్శలు చేస్తే అటువంటి వారిని బ్లాక్ చేయడంలో వెనుకాడనని హెచ్చరించింది. వ్యక్తిగత జీవితాన్ని గౌరవించాలని, ప్రతి ఒక్కరికీ వారి ప్రైవసీ ముఖ్యమని ఆమె స్పష్టం చేసింది. ప్రస్తుతం కృతి శెట్టి తన కెరీర్‌పై పూర్తి దృష్టి సారించినట్లు కనిపిస్తోంది. కొత్త కథలు, విభిన్న పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకోవాలని ఆమె లక్ష్యంగా పెట్టుకుంది. భవిష్యత్తులో మరింత మెరుగైన ప్రదర్శనతో తిరిగి సక్సెస్ ట్రాక్‌లోకి రావాలని ప్రయత్నిస్తోంది. అభిమానులు కూడా ఆమె కొత్త సినిమాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మొత్తానికి, వ్యక్తిగత జీవితంలో ఎదురైన ఆటుపోట్లను ధైర్యంగా ఎదుర్కొంటూ, వృత్తిపరంగా ముందుకు సాగుతున్న కృతి శెట్టి ప్రస్తుతం టాలీవుడ్‌లో మళ్లీ తన స్థానాన్ని బలపర్చుకునే దిశగా అడుగులు వేస్తోంది.

# లెనిన్ విడుదల తేదీ ఖరారు

**వేద న్యూస్ డెస్క్:**



టాలీవుడ్‌లో భారీ సినిమాల విడుదల తేదీలు వరుసగా మారుతూ ఉండటం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఒక సినిమా వాయిదా పడితే మరొక సినిమాపై ప్రభావం చూపుతూ ఈ పరిస్థితి కొనసాగుతోంది. ముఖ్యంగా పెద్ద హీరోల చిత్రాల మధ్య పోటీ, షూటింగ్ ఆలస్యాలు కారణంగా విడుదల తేదీల్లో గందరగోళం నెలకొంటోంది. ఈ నేపథ్యంలో అఖిల్ నటిస్తున్న 'లెనిన్' చిత్రంపై కూడా అనిశ్చితి నెలకొంది. రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' సినిమా విడుదల తేదీ మార్పులు ఇతర సినిమాలపై ప్రభావం చూపాయి. మొదట మార్చి 27న విడుదల చేయాలని భావించిన ఆ చిత్రాన్ని షూటింగ్ ఆలస్యాల కారణంగా ఏప్రిల్ 30కు మార్చారు. అయితే ఆ తేదీ కూడా సాధ్యం కాదనే అభిప్రాయం సినీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఈ అనిశ్చితి కారణంగా ఇతర సినిమాల ప్రణాళికలు కూడా మారాల్సి వచ్చింది. మొదట 'పెద్ది' ఏప్రిల్ 30న విడుదల అవుతుందనే కారణంతో 'లెనిన్' చిత్రాన్ని వాయిదా వేశారు. అయితే ఇప్పుడు 'పెద్ది' మళ్లీ వాయిదా పడే పరిస్థితి ఉన్నప్పటికీ, 'లెనిన్' అదే తేదీకి రావడం సాధ్యం కాదని చిత్రబృందం భావించింది. ఈ నేపథ్యంలో అఖిల్ జన్మదినాన్ని పురస్కరించుకుని చిత్రబృందం కొత్త పోస్టర్ విడుదల చేస్తూ జూన్ 26న సినిమా విడుదల అవుతుందని అధికారికంగా ప్రకటించింది. దీంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. అభిమానులు ఈ సందర్భంగా చిత్రానికి సంబంధించిన టీజర్ విడుదల అవుతుందని ఆశించినప్పటికీ, అది జరగకపోవడంతో కొంత నిరాశ వ్యక్తం చేస్తున్నారు. అయితే విడుదల తేదీ ప్రకటనతో సినిమాపై మళ్లీ చర్చ ప్రారంభమైంది. ఈ చిత్రానికి 'వినరో భాగ్యము విష్ణు కథ'తో గుర్తింపు పొందిన మురళీ కృష్ణ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్నాడు. అఖిల్ సరసన భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే విడుదల చేసిన శీర్షిక దృశ్యాలు, పాటలు ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించాయి. ప్రముఖ నటుడు శివాజీ కీలక పాత్రలో కనిపించనున్నాడు. సంగీతాన్ని తమన్ అందిస్తుండగా, మనం ఎంటర్‌ప్రైజెస్ మరియు సితార ఎంటర్టైన్మెంట్స్ సంస్థలు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మాణ బాధ్యతలు చేపట్టడం విశేషం. హీరోగా అఖిల్ ఇప్పటివరకు పలు చిత్రాల్లో నటించినప్పటికీ, ఆశించిన స్థాయి విజయాన్ని అందుకోలేకపోయాడు. ఈ నేపథ్యంలో 'లెనిన్' చిత్రం అతని కెరీర్‌కు కీలకంగా మారనుంది. మంచి కథ, బలమైన నిర్మాణంతో వస్తున్న ఈ చిత్రం ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో చూడాల్సి ఉంది.

# ఎన్టీఆర్-నీల్ షూటింగ్‌పై క్లారిటీ




**వేద న్యూస్ డెస్క్:**

యంగ్ టైగర్ ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కలయికలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రంపై ఇటీవల వస్తున్న వార్తలకు చిత్రబృందం పూర్తి స్థాయిలో క్లారిటీ ఇచ్చింది. ఈ సినిమా షూటింగ్ నిలిచిపోయిందన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని నిర్మాణ సంస్థ స్పష్టం చేసింది. సామాజిక మాధ్యమాల్లో ఎన్టీఆర్ కొత్త లుక్‌పై అసంతృప్తి వ్యక్తమవడంతో షూటింగ్ ఆపేశారని వచ్చిన వార్తలు నిరాధారమని పేర్కొంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం అధికారికంగా స్పందిస్తూ, సినిమా షూటింగ్ ఎలాంటి ఆటంకం లేకుండా ప్రణాళిక ప్రకారమే కొనసాగుతోందని తెలిపింది. ప్రస్తుతం తీసుకున్న చిన్న విరామం కూడా సాధారణమైనదేనని, ఇది తదుపరి భారీ షెడ్యూల్ కోసం సన్నాహాలు చేసుకునే భాగమని వివరించింది. షూటింగ్‌కు సంబంధించిన ప్రతి అంశం ముందుగానే ప్లాన్ ప్రకారం జరుగుతోందని, ఎక్కడా అంతరాయం లేదని స్పష్టం చేసింది. ఎన్టీఆర్ లుక్‌పై వస్తున్న ఊహాగానాలను కూడా చిత్రబృందం ఖండించింది. అతని రూపంపై ఎలాంటి అసంతృప్తి లేదని, సినిమా కోసం ప్రత్యేకంగా డిజైన్ చేసిన లుక్‌ను ప్రేక్షకులు త్వరలోనే చూసే అవకాశం ఉంటుందని తెలిపింది. అధికారిక ప్రకటనలకే ప్రాధాన్యత ఇవ్వాలని, వదంతులను నమ్మవద్దని అభిమానులకు విజ్ఞప్తి చేసింది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన కీలక భాగాల షూటింగ్ విదేశీ ప్రదేశాల్లో విజయవంతంగా పూర్తి చేసినట్లు సమాచారం. ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఉన్న ఈ సినిమాలో ఎన్టీఆర్ కోసం ప్రత్యేకంగా ట్రైనింగ్ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిసింది. అతని పాత్ర ఈ సినిమాలో మరింత శక్తివంతంగా, కొత్త కోణంలో కనిపించబోతుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. దర్శకుడు ప్రశాంత్ నీల్ తన ప్రత్యేక శైలిలో ఈ సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారని, కథ, యాక్షన్ ఎలిమెంట్స్, విజువల్స్ అన్నీ కూడా ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉండబోతున్నాయని సమాచారం. ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే అభిమానుల్లోనే కాకుండా పరిశ్రమ వర్గాల్లో కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం తదుపరి షెడ్యూల్ కోసం చిత్రబృందం పూర్తి స్థాయిలో సిద్ధమవుతోంది. త్వరలోనే మరో కీలక దశ షూటింగ్ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. మొత్తం మీద, ఈ సినిమా ఎలాంటి ఆటంకం లేకుండా వేగంగా ముందుకు సాగుతుండగా, విడుదలయ్యే సమయానికి ఇది భారీ హిట్‌గా నిలిచే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

# కీర్తిపై సమంత క్లారిటీ

**వేద న్యూస్ డెస్క్:**



స్టార్ నటి సమంత తాజాగా మరో నటి గురించి చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ప్రస్తుతం సినిమాలతో పాటు నిర్మాణ రంగంలోనూ బిజీగా ఉన్న ఆమె, సహనటి కీర్తి సురేష్‌పై వస్తున్న ప్రచారాలపై స్పందించారు. ఇటీవలి కాలంలో కీర్తి సురేష్ మద్యం సేవిస్తుందనే వదంతులు సామాజిక మాధ్యమాల్లో వినిపిస్తున్న నేపథ్యంలో సమంత స్పష్టత ఇచ్చారు. కీర్తి సురేష్‌కు అలాంటి అలవాటు ఏదీ లేదని, ఆ వార్తల్లో నిజం లేదని ఆమె తెలిపారు. అయితే కీర్తి సురేష్‌కు మరో ప్రత్యేక అలవాటు ఉందని సమంత వెల్లడించారు. ఆమె ఎప్పుడూ ఉత్సాహంగా మాట్లాడుతూ, చుట్టూ ఉన్న వారిని నవ్విస్తూ ఉంటారని చెప్పారు. ఒకసారి మాట్లాడటం ప్రారంభిస్తే ఆపకుండా మాట్లాడుతూనే ఉండటం, సరదాగా పద్యాల్లా మాట్లాడటం ఆమెకు అలవాటని వివరించారు. అర్ధరాత్రి వరకు కూడా చురుకుగా మాట్లాడుతూ అందరిని అలరించగల స్వభావం ఆమెదని సమంత పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

# రణవీర్ నా అదృష్టం: మృణాల్

**వేద న్యూస్ డెస్క్:**



నటి మృణాల్ ఠాకూర్ తాజాగా చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీస్తున్నాయి. తన సినీ ప్రయాణంలో బాలీవుడ్ నటుడు రణవీర్ సింగ్ కీలక పాత్ర పోషించాడని ఆమె వెల్లడించారు. ఒక సంభాషణ కార్యక్రమంలో మాట్లాడిన ఆమె, రణవీర్‌ను తన జీవితంలో లక్కీ ఛార్మ్‌గా భావిస్తున్నానని చెప్పారు. ఈరోజు తాను చిత్ర పరిశ్రమలో నటిగా నిలబడటానికి ప్రధాన కారణం ఆయనేనని భావోద్వేగంతో తెలిపారు. తన కెరీర్ ప్రారంభ దశలో రణవీర్ సింగ్‌తో కలిసి ఒక ప్రకటనలో నటించే అవకాశం వచ్చినట్లు మృణాల్ తెలిపారు. ఆ ప్రకటన ప్రసారం అయిన తర్వాత సినీ వర్గాల్లో తనకు గుర్తింపు వచ్చిందని, నిర్మాతలు తనను గమనించి అవకాశాలు ఇవ్వడం ప్రారంభించారని చెప్పారు. ఆ ఒక్క అవకాశం తన జీవితాన్ని పూర్తిగా మార్చిందని ఆమె వెల్లడించారు. రణవీర్ ఎంతో ఉత్సాహభరితమైన వ్యక్తి అని, ఆయనతో కలిసి పనిచేయడం తనకు ప్రత్యేక అనుభూతిని ఇచ్చిందని అన్నారు. అలాగే ఆయన నటన గురించి ప్రత్యేకంగా ప్రశంసిస్తూ, ఒక చిత్రంలో ఆయన నటించిన పాత్రలో పూర్తిగా మునిగిపోయారని తెలిపారు. సినిమా చూస్తున్నంతసేపు నటుడిగా ఆయన కనిపించలేదని, ఆ పాత్ర మాత్రమే కనిపించిందని చెప్పారు. ఒక హీరోలా కాకుండా ఆ పాత్రలోకి పూర్తిగా పరకాయ ప్రవేశం చేసిన విధానం తనను ఎంతో ప్రభావితం చేసిందని పేర్కొన్నారు. ఆయనలో ఉన్న అంకితభావం, కష్టపడే తత్వం ప్రతి ఒక్కరికీ ప్రేరణగా నిలుస్తుందని మృణాల్ అన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073